పార్టీ బలోపేతానికి కార్యకర్తలు అహర్నిశలు శ్రమించాలి

- **ప్రతి గడపకు కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను చేరవేయాలి**
- **క్షేత్రస్థాయిలో పార్టీ బలోపేతానికి కార్యకర్తలే కీలకం: బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేష్ కులచారి**

విశాల భారతి, ఇందల్వాయి : పార్టీ బలోపేతానికి ప్రతి కార్యకర్త అహర్నిశలు శ్రమించాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేష్ కులచారి పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రతి గడపకు చేరవేసి ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు. గ్రామస్థాయి నుంచి పార్టీని బలోపేతం చేయడంలో క్షేత్రస్థాయి కార్యకర్తల పాత్ర అత్యంత కీలకమని పేర్కొన్నారు. ఇందల్వాయి మండల కేంద్రంలోని తీర్మన్‌పల్లి గౌడ సంఘ భవనంలో బీజేపీ మండల శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశానికి దినేష్ కులచారి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు పార్టీ సిద్ధాంతాలను ప్రతి గ్రామంలో విస్తృతంగా ప్రచారం చేయాలని కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. త్వరలో తెలంగాణలో నిర్వహించనున్న భారీ బహిరంగ సభకు బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబి హాజరుకానున్న నేపథ్యంలో నిజామాబాద్ రూరల్ నియోజకవర్గం నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి సభను విజయవంతం చేయాలని కోరారు. పార్టీ పటిష్ఠతకు ప్రతి నాయకుడు, కార్యకర్త సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ సమావేశంలో బీజేపీ మాజీ మండల అధ్యక్షుడు నాయిడి రాజన్న, మండల ఇన్‌చార్జ్ అధ్యక్షుడు శ్రీనివాస్ జెల్లెల్ల, నల్లవెల్లి సర్పంచ్ కన్నె రాజేందర్, స్టేషన్ తండా సర్పంచ్ జగత్ సింగ్, దిశా కమిటీ సభ్యుడు ప్రదీప్ రెడ్డి, ఓబీసీ మోర్చా ప్రధాన కార్యదర్శి తన్నీరు వాసు, ఎస్సీ మోర్చా జిల్లా కార్యవర్గ సభ్యుడు మహేందర్, కిసాన్ మోర్చా అధ్యక్షుడు శ్రీనివాస్, ఎస్టీ మోర్చా అధ్యక్షుడు కిషన్, నాయకులు శ్రావణ్, అశోక్, మహేష్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఇచ్చిన మాట ప్రకారం రోడ్డు మరమ్మతులకు శ్రీకారం

విశాల భారతి, జీలుగుమిల్లి : ప్రజలకు ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటూ నూతన ఎంపీటీసీ బోడిక బోగేశ్వరరావు గ్రామ అభివృద్ధికి తొలి అడుగు వేశారు. ఇటీవల తుపాను ప్రభావంతో దెబ్బతిని, కొట్టుకుపోయిన కామయ్యపాలెం నుంచి బొత్తపాగూడెం వెళ్లే రహదారికి మరమ్మతులు చేపట్టారు. కామయ్యపాలెం గ్రామంలో మాజీ సర్పంచ్‌గా పని చేసిన బోడిక బోగేశ్వరరావు గతంలో గ్రామ ప్రజలకు పలు సేవలు అందించారు. ప్రజలతో సత్సంబంధాలు కలిగి, ఎవరికి ఏ సమస్య వచ్చినా స్పందించే నాయకుడిగా గుర్తింపు పొందారు. తాజాగా ఎంపీటీసీగా ప్రజల ఆదరాభిమానాలు పొందిన ఆయన, గ్రామ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ నేపథ్యంలో ఇటీవల తుపాను కారణంగా దెబ్బతిన్న రహదారిని కామయ్యపాలెంలోని స్థానిక నివాస ప్రాంతం నుంచి బొత్తపాగూడెం వరకు మరమ్మతులు చేయించారు. మార్గమధ్యంలో ఏర్పడిన గుంతలను పూడ్చడంతో పాటు, గాలుల ప్రభావంతో రోడ్డుకు ఇరువైపులా విరిగిపడిన చెట్ల కొమ్మలను తొలగించి రాకపోకలకు ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టారు. ప్రజల ఆశయాలను నెరవేర్చడమే లక్ష్యంగా,



వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తల సహకారంతో గ్రామంలో అభివృద్ధి కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్తామని బోడిక బోగేశ్వరరావు తెలిపారు. ఇచ్చిన మాట ప్రకారం అభివృద్ధి పనులకు తొలి అడుగు పడటంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ రహదారి మరమ్మతుల కార్యక్రమంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సందా ప్రసాద్, గ్రామ పార్టీ అధ్యక్షుడు ఉప్పల రాంపండు, వైస్ ప్రెసిడెంట్ దొడ్డకుల జగదీశ్, సీనియర్ నాయకులు కరక లక్ష్మణరావు, కాకా వీరాజు, గ్రామ నాయకులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

సమతామూర్తి సన్నిధిలో చావా అరుణకు ఘన సత్కారం

- సామాజిక సేవకు గుర్తింపుగా పురస్కారం, ప్రశంసాపత్రం అందజేత



సైబరాబాద్ విశాల భారతి: రంగారెడ్డి జిల్లా ముచ్చింతల్‌లోని సమతామూర్తి క్షేత్రంలో శ్రీశ్రీశ్రీ త్రిదండి చిన్నశ్రీమన్నారాయణ రామానుజ జీయర్ స్వామీజీ 70వ తిరునక్షత్ర మహోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఈ సందర్భంగా సామాజిక సేవలో విశేష కృషి చేస్తున్న డ్రీమ్ ఫర్ గుడ్ సొసైటీ వ్యవస్థాపకురాలు చావా అరుణకు ఘన సత్కారం లభించింది.సమాజ సేవలో ఆమె అందిస్తున్న విశేష సేవలను గుర్తించిన త్రిదండి చిన్న జీయర్ స్వామివారు శాలువాతో సత్కరించి పురస్కారం, ప్రశంసాపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో సొసైటీ విద్యార్థులు కూడా పాల్గొని అవార్డులు అందుకున్నారు. అనంతరం సమతా మూర్తిని దర్శించుకుని స్వామివారి ఆశీస్సులు పొందారు. కార్యక్రమంలో సొసైటీ సభ్యులు, విద్యార్థులు, భక్తులు పాల్గొన్నారు.

మద్యం తాగి వాహనాలు నడిపిన ఐదుగురికి జైలు శిక్ష

- ఒకరికి 10 రోజులు.. మరో నలుగురికి నాలుగు రోజుల జైలు
- ఎనిమిది కేసుల పరిష్కారం.. రూ.6,500 జరిమానా



సైబరాబాద్ విశాల భారతి: మద్యం సేవించి వాహనాలు నడిపిన ఐదుగురికి న్యాయస్థానం జైలు శిక్ష విధించింది. మేడ్చల్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో డ్రంక్ అండ్ డ్రైవ్, డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపిన ఘటనలకు సంబంధించి నమోదైన ఎనిమిది కేసులను గురువారం మేడ్చల్‌లోని ప్రధాన జూనియర్ సివిల్ జడ్జి కమ్ ఏడో అదనపు జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ న్యాయస్థానంలో విచారించి పరిష్కరించారు. డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపిన రెండు కేసుల్లో రూ.2 వేల జరిమానా విధించగా, డ్రంక్ అండ్ డ్రైవ్‌కు సంబంధించిన ఆరు కేసుల్లో రూ.4,500 జరిమానాతో పాటు ఐదుగురికి జైలు శిక్ష విధించారు. ఇందులో ఒకరికి 10 రోజులు, మరో నలుగురికి నాలుగు రోజుల చొప్పున జైలు శిక్ష ఖరారు చేశారు. ఈ సందర్భంగా మేడ్చల్ ట్రాఫిక్ పోలీసులు వాహనదారులను హెచ్చరిస్తూ మద్యం సేవించి వాహనాలు నడపవద్దని, తప్పనిసరిగా చెల్లుబాటయ్యే డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని సూచించారు. ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించి తమ ప్రాణాలతో పాటు ఇతరుల ప్రాణాలను ప్రమాదంలోకి నెట్టవద్దని స్పష్టం చేశారు.

బీజేపీ బలోపేతానికి కృషి చేయాలి

- గిరిజనుల హక్కులు, సంక్షేమం కోసం నిరంతరం ప్రజల్లో ఉండాలి
- బిజెపి అసెంబ్లీ ఇంచార్జ్ రవికుమార్ యాదవ్



సైబరాబాద్ విశాల భారతి: పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తూ, బీజేపీ బలోపేతమే లక్ష్యంగా పనిచేయాలని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, శేరిలింగంపల్లి నియోజకవర్గ ఇన్‌ఛార్జి రవికుమార్ యాదవ్ పిలుపునిచ్చారు. రంగారెడ్డి అర్బన్ జిల్లా ఎస్టీ మోర్చా ప్రధాన కార్యదర్శిగా జగదీష్ నాయక్, కార్యదర్శిగా రాయుడు నాయక్ నూతనంగా నియమితులైన సందర్భంగా వారు గురువారం రవికుమార్ యాదవ్‌ను ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా రవికుమార్ యాదవ్ వారికి శాలువాలు కప్పి అభినందించారు. పార్టీలో కష్ట పడి పనిచేసే ప్రతి కార్యకర్తకు తగిన గుర్తింపు, సముచిత స్థానం లభిస్తాయని, వీరి నియామకాలే అందుకు నిదర్శనమని పేర్కొన్నారు. గిరిజనుల హక్కులు, సంక్షేమం కోసం నిరంతరం ప్రజల్లో ఉంటూ, కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను క్షేత్రస్థాయిలోకి తీసుకెళ్లాలని సూచించారు. తమకు అప్పగించిన బాధ్యతలను చిత్తశుద్ధితో నిర్వర్తిస్తూ శేరిలింగంపల్లితో పాటు రంగారెడ్డి అర్బన్ జిల్లా వ్యాప్తంగా పార్టీ విజయానికి కృషి చేస్తామని నూతనంగా నియమితులైన నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఎస్టీ మోర్చా ఉపాధ్యక్షుడు హనుమంత్ నాయక్ పాల్గొన్నారు.


అత్యాధునిక కంప్యూటర్లను ప్రారంభించిన జీఎం రాధాకృష్ణ

విశాల భారతి, రామకృష్ణాపూర్ (మందమర్రి): సింగరేణి మైనింగ్ కార్యకలాపాల్లో సాంకేతిక సామర్థ్యం, పనుల ఖచ్చితత్వాన్ని మరింత పెంపొందించే దిశగా మందమర్రి ఏరియా యాజమాన్యం చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా మందమర్రి ఏరియా జనరల్ మేనేజర్ కార్యాలయంలోని సర్వే విభాగానికి నూతనంగా సమకూర్చిన అత్యాధునిక సాంకేతిక సామర్థ్యం కలిగిన కంప్యూటర్లను ఏరియా జనరల్ మేనేజర్ ఎన్.రాధాకృష్ణ గురువారం లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ.. గనుల నిర్వహణలో సర్వే విభాగం అత్యంత కీలకమైన బాధ్యతలు నిర్వర్తిస్తోందని పేర్కొన్నారు. గనులకు సంబంధించిన సర్వే వివరాల సేకరణ, డేటా విశ్లేషణ, మ్యాపింగ్ తదితర సాంకేతిక పనులను సమర్థవంతంగా నిర్వహించేందుకు అధునాతన కంప్యూటింగ్ వ్యవస్థలు అవసరమని తెలిపారు. నూతనంగా ఏర్పాటు చేసిన అత్యాధునిక సాంకేతిక సామర్థ్యం కలిగిన కంప్యూటర్ల వినియోగంతో సర్వే పనుల్లో వేగం, ఖచ్చితత్వం పెరగడంతో పాటు సాంకేతిక విశ్లేషణ మరింత సులభతరం అవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని విధుల్లో సమర్థవంతంగా వినియోగించుకుంటూ, సంస్థ కార్యకలాపాలను మరింత మెరుగుపరిచేందుకు అధికారులు, సిబ్బంది కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కేకేఓసీపీ ప్రాజెక్ట్ ఆఫీసర్ రాంబాబు, డీజీఎం (సర్వే) ముఖ్య దేశాయ్, ఐటీ మేనేజర్ రవి, జూనియర్ సర్వే అధికారులు నరేష్, సదానందం సర్వే విభాగం అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

శ్వాస, శ్వానీలను ఆశీర్వదించిన మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి

- పుష్పాలంకరణ వేడుకలో పాల్గొని చిన్నారులకు ఆశీస్సులు అందజేత

విశాల భారతి, భూపాలపల్లి ప్రతినిధి : జయశంకర్ భూపాలపల్లి జిల్లా మొగుళ్లపల్లి మండలంలోని ఎల్లారెడ్డిపల్లె గ్రామంలో గురువారం నిర్వహించిన పుష్పాలంకరణ వేడుకలో భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి పాల్గొన్నారు. గ్రామానికి చెందిన మర్రి మౌనిక, ఐలయ్య దంపతుల కుమార్తెలు శ్వాస, శ్వానీల పుష్పాలంకరణ వేడుకను స్థానిక కేఎస్ఆర్ ఫంక్షన్ హాల్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి చిన్నారులు శ్వాస, శ్వానీలను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు. చిన్నారులు ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఎదగాలని ఆకాంక్షించారు. అనంతరం కుటుంబ సభ్యులతో ముచ్చటించి వారికి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మొగుళ్లపల్లి మాజీ సర్పంచ్ బత్తిని శ్రీహరి గౌడ్, పిడిసిల్ల మాజీ ప్రజాప్రతినిధి నైనకంటి ప్రభాకర్ రెడ్డి, ఎల్లారెడ్డిపల్లె వార్డు సభ్యురాలు బండారి అనూష, కుమార్ యాదవ్, బీఆర్ఎస్ నాయకుడు మాదం సురేష్, పెంతల తిరుపతి, కొనుకటి కొమురయ్య, గిరబోయిన శ్రీనివాస్, కొనుకటి అశోక్, గోనె రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.



గచ్చిబౌలిలో నిషేధిత ఈసిగరెట్ల దందా గుట్టురట్టు

- ఈగల్ ఫోర్స్, రాయదుర్గం పోలీసుల సంయుక్త దాడి.. మేనేజర్ అరెస్ట్
- 46 వేప్స్, 49 విదేశీ సిగరెట్ ప్యాకెట్లు స్వాధీనం

సైబరాబాద్ - విశాల భారతి



నిషేధిత ఈసిగరెట్ల అక్రమ విక్రయాలు, సరఫరాపై తెలంగాణ ఈగల్ ఫోర్స్, సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలోని రాయదుర్గం పోలీసులు సంయుక్తంగా దాడులు నిర్వహించారు. రాయదుర్గంలోని 'స్మోకిన్ స్పాట్' దుకాణంపై దాడి చేసి మేనేజర్ అబూబకర్ సిద్ధిఖీ (28)ని అరెస్ట్ చేయడంతో పాటు 46 ఈసిగరెట్లు, 49 విదేశీ సిగరెట్ ప్యాకెట్లు, రెండు సెల్‌ఫోన్లు, రెండు డిజిటల్ చెల్లింపుల స్కానర్లను స్వాధీనం చేసుకున్నారు. కేరళకు చెందిన దుకాణ యజమాని మహమ్మద్ షరీఫ్ ఈ ఏడాది మార్చిలో నెలకు రూ.25 వేల జీతంతో సిద్ధిఖీని మేనేజర్‌గా నియమించినట్లు విచారణలో వెల్లడైంది. ఈ అక్రమ వ్యాపారానికి కేరళకు చెందిన అర్షద్ సరఫరాదారుగా వ్యవహరిస్తున్నట్లు అనుమానిస్తుండగా, అతను ప్రస్తుతం పరారీలో ఉన్నాడు. వాట్సాప్ ద్వారా ఈసిగరెట్ల ఆర్డర్లు తీసుకుని, ఎస్‌బీఐ, ఫెడరల్ బ్యాంకు ఖాతాలకు అనుసంధానించిన స్కానర్లు, ఫోన్‌పే ద్వారా చెల్లింపులు స్వీకరించి ర్యాపిడో ద్వారా ఇంటి వద్దకే సరఫరా చేస్తున్నట్లు ప్రాథమిక విచారణలో గుర్తించారు.అక్టోబర్, నవంబర్ నెలల్లో సుమారు 107 ఈసిగరెట్లను ఒక్కొక్కటి రూ.2,800 నుంచి రూ.4 వేల వరకు విక్రయించినట్లు అనుమానిస్తున్నారు. జైనా, దుబాయ్ నుంచి కేరళ, కర్ణాటక మీదుగా తెలంగాణకు నిషేధిత ఈసిగరెట్లు సరఫరా అవుతున్నాయా? అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ర్యాపిడో, పోర్టర్, ఉబర్ వంటి రవాణా వేదికలను అక్రమ సరఫరాకు వినియోగించుకున్నారా? హవాలా మార్గాల్లో లావాదేవీలు జరిగాయా? అనే అంశాలను పరిశీలిస్తున్నారు. ఈ అక్రమ దందా ద్వారా రూ.10 కోట్లకు పైగా విలువైన ఈసిగరెట్లు తెలంగాణలోకి చేరినట్లు అనుమానిస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఈగల్ ఫోర్స్ ఇప్పటివరకు 11 కేసులు నమోదు చేసి 18 మందిని అరెస్ట్ చేయగా, మరో 21 మంది పరారీలో ఉన్నారు. సుమారు 1,619 బాక్సుల ఈసిగరెట్లను స్వాధీనం చేసుకున్నారు. 40 వేల నుంచి 50 వేల పఫ్‌ల సామర్థ్యమున్న వేప్ పరికరాల పేరుతో యువతను ఆకర్షిస్తూ వారి ఆరోగ్యంతో చెలగాటమాడుతున్నారని అధికారులు ఆందోళన వ్యక్తం చేశారు. నిషేధిత ఎలక్ట్రానిక్ సిగరెట్ల విక్రయం, రవాణా, నిల్వ, పంపిణీపై 2019 చట్టం ప్రకారం చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఈ ఘటనపై రాయదుర్గం పోలీస్ స్టేషన్‌లో క్రైమ్ నంబర్ 1292/2026 కింద సంబంధిత చట్టాల ప్రకారం కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు.



గచ్చిబౌలిలో జీకేఎస్ హాస్పిటల్స్ ప్రారంభం

- అందుబాటు ధరల్లో నాణ్యమైన వైద్య సేవలు అందించడమే లక్ష్యం
- కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్

సైబరాబాద్ విశాల భారతి: గచ్చిబౌలి ప్రాంత ప్రజలకు అత్యాధునిక వైద్య సదుపాయాలను అందుబాటులోకి తీసుకురావడమే లక్ష్యంగా నూతనంగా ఏర్పాటు చేసిన జీకేఎస్ హాస్పిటల్స్‌ను గురువారం ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన శేరిలింగంపల్లి కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్ జ్యోతి ప్రజ్వలన చేసి ఆసుపత్రిని లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గచ్చిబౌలి పరిసర ప్రాంతాల్లో అత్యాధునిక వైద్య సదుపాయాలతో ఆసుపత్రి ఏర్పాటు కావడం సంతోషకరమని, పేద, మధ్యతరగతి ప్రజలకు అందుబాటు ధరల్లో నాణ్యమైన వైద్యం అందించాలని ఆకాంక్షించారు. అత్యవసర వైద్య సేవలు, అధునాతన వైద్య పరికరాలు, అనుభవజ్ఞులైన వైద్య బృందంతో ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని ఆసుపత్రి యాజమాన్యానికి సూచిస్తూ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి యాజమాన్య ప్రతినిధి డాక్టర్ కుమార్, గచ్చిబౌలి గ్రామ అధ్యక్షుడు సయ్యద్ నయీమ్, అశోక్ సింగ్, నదీమ్, ఆష్జాల్, ఖాసీం, రవి నాయక్, ఇబ్రహీం, వైద్యులు, సిబ్బంది, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

స్వచ్ఛ భారత్ మిషన్ అమలుకు అధికారులకు ప్రత్యేక శిక్షణ




- పట్టణ పారిశుధ్యం, ఘన వ్యర్థాల నిర్వహణపై సామర్థ్య పెంపునకు చర్యలు

సైబరాబాద్ - విశాల భారతి

స్వచ్ఛ భారత్ మిషన్ (అర్బన్) 2.0 కార్యక్రమాల అమలును మరింత సమర్థవంతంగా చేపట్టే లక్ష్యంతో సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (సీఎంసీ) అధికారులకు ఒకరోజు సామర్థ్య అభివృద్ధి శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించింది. బంజారాహిల్స్‌లోని అడ్మినిస్ట్రేటివ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా (ఏఎస్‌సీఐ)లో గురువారం నిర్వహించిన ఈ కార్యక్రమాన్ని ఏఎస్‌సీఐ డైరెక్టర్ జనరల్ డాక్టర్ ఎన్. రమేష్ కుమార్, సీఎంసీ కమిషనర్ డాక్టర్ జి.శ్రీజన, ఏఎస్‌సీఐ డీన్ ఆఫ్ రీసెర్చ్ స్టడీస్, సెంటర్ డైరెక్టర్ డాక్టర్ ఎన్. జనార్ధన్ రెడ్డి ప్రారంభించారు. ఈ శిక్షణలో సీఎంసీ జోనల్ కమిషనర్లు, అదనపు కమిషనర్లు, డిప్యూటీ కమిషనర్లు, ఇంజినీరింగ్, టౌన్ ప్లానింగ్ విభాగాల అధికారులు పాల్గొన్నారు. పట్టణ పారిశుధ్య నిర్వహణ, ఘన వ్యర్థాల సేకరణ, నిర్వహణ, స్వచ్ఛ భారత్ మిషన్ అమలు విధానాలు, సాంకేతిక పరిజ్ఞానం, పరిపాలనా నైపుణ్యాలపై అధికారులకు అవగాహన కల్పించారు. పట్టణ పాలనను బలోపేతం చేస్తూ ప్రజలకు మెరుగైన పారిశుధ్య సేవలు అందించేందుకు అధికారుల సామర్థ్యాన్ని పెంపొందించడమే ఈ శిక్షణ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని సీఎంసీ వర్గాలు వెల్లడించాయి.

ఇక ఇంటి వద్దకే ప్రభుత్వ సేవలు..
1100కు కాల్ చేస్తే చాలు!



సైబరాబాద్ - విశాల భారతి

ప్రజలకు ప్రభుత్వ సేవలను మరింత చేరువ చేసేందుకు తెలంగాణ ప్రభుత్వ ఈఎన్‌డీ శాఖ, సైబరాబాద్ పోలీస్, సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్, ఎస్‌సీఎస్‌సీ సంయుక్తంగా మీ సేవ డోర్‌స్టెప్ డెలివరీ కార్యక్రమాన్ని ప్రారంభించాయి. గచ్చిబౌలిలోని సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్‌లో నిర్వహించిన కార్యక్రమంలో సైబరాబాద్ సీపీ డాక్టర్ ఎం. రమేష్, మున్సిపల్ కమిషనర్ డాక్టర్ జి. శ్రీజన, ఈఎన్‌డీ కమిషనర్ టి. రవికిరణ్ పాల్గొన్నారు. శిక్షణ పొందిన ప్రతినిధులు ఇంటి వద్దకే వచ్చి ప్రభుత్వ సేవలు అందిస్తారని, ముఖ్యంగా వృద్ధులు, దివ్యాంగులకు ఇది ఎంతో ఉపయోగకరమని అధికారులు తెలిపారు. ఈ సేవల కోసం 1100కు కాల్ చేసి 1 నొక్కాలని లేదా మీ సేవ వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సూచించారు. అలాగే మీటికెట్ యాప్ ద్వారా బస్సు, మెట్రో టికెట్లు, బస్ పాస్‌లు, జూ, పార్కుల టికెట్లు బుక్ చేసుకునే సదుపాయాన్ని పరిచయం చేశారు. ఈ సేవలపై నివాస సముదాయాల్లో విస్తృత అవగాహన కల్పించాలని ఆర్‌డబ్ల్యూఏ ప్రతినిధులకు సూచించారు.

హెచ్‌సీయూలో క్రికెట్ సందడి.. యూఓహెచ్ ప్రో టీ20 లీగ్ షెడ్యూల్ విడుదల

- నవంబర్ 12 నుంచి 15 వరకు హోరాహోరీ మ్యాచ్‌లు



సైబరాబాద్ విశాల భారతి: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగం ఆధ్వర్యంలో యూఓహెచ్ ప్రో టీ20 లీగ్ క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభమైంది. ఈ సందర్భంగా నిర్వాహకులు మ్యాచ్‌ల షెడ్యూల్‌ను విడుదల చేశారు. అడిషనల్ ఎస్పీ జి. వెంకటేశ్వరులు ముఖ్య అతిథిగా పాల్గొనగా, గురువారం హైదరాబాద్ యూనివర్సిటీ-షాదన్ జట్ల మధ్య తొలి మ్యాచ్‌తో పోటీలు మొదలయ్యాయి. నవంబర్ 14న అరోరా-మహీంద్రా జట్లు, 15న ఉదయం హెచ్‌సీయూ హాక్స్-ఎల్లెంకి జట్లు, మధ్యాహ్నం హైదరాబాద్ యూనివర్సిటీ-మహీంద్రా జట్లు తలపడనున్నాయి. యువ క్రీడాకారుల్లోని ప్రతిభను వెలికితీసి, వారికి మంచి వేదిక కల్పించడమే ఈ లీగ్ లక్ష్యమని ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగం అసిస్టెంట్ డైరెక్టర్ సిద్ధార్థ్ డి. తెలిపారు. అన్ని జట్లు క్రీడాస్ఫూర్తితో ఆడి విజయం సాధించాలని ఆకాంక్షించారు. విద్యార్థులు, క్రీడాభిమానులు పెద్ద సంఖ్యలో హాజరై టోర్నమెంట్‌ను విజయవంతం చేయాలని నిర్వాహకులు కోరారు. కార్యక్రమంలో రాజశేఖర్ సింగదాసరి, ఈశ్వర్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

వాటర్ ట్యాంకర్ రూపంలో మృత్యువు.. సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ దుర్మరణం

- నల్లగండ్ల ఫ్లైఓవర్ వద్ద ఘోర ప్రమాదం.. ఇద్దరు చిన్నారులకు తండ్రి దూరం



సైబరాబాద్ విశాల భారతి : నల్లగండ్ల ఫ్లైఓవర్ సిగ్నల్ వద్ద గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ మృత్యువాత పడ్డాడు.పోలీసుల వివరాల ప్రకారం.. బీరంగూడకు చెందిన ఎ. రాజ్‌కుమార్ (40) గురువారం మధ్యాహ్నం తన హోండా యాక్టివాపై గచ్చిబౌలి నుంచి పటాన్‌చెరు వైపు వెళ్తున్నాడు. ఈ క్రమంలో నల్లగండ్ల ఫ్లైఓవర్ సిగ్నల్ వద్దకు చేరుకోగానే పక్క నుంచి వచ్చిన వాటర్ ట్యాంకర్ (టీఎస్ 08 యూఏ 8274) డ్రైవర్ నిర్లక్ష్యంగా నడుపుతూ ఆయన ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టాడు.ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన రాజ్‌కుమార్‌ను ఆసుపత్రికి తరలించగా, అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడికి తొమ్మిది, ఐదేళ్ల వయసున్న ఇద్దరు కుమారులు ఉన్నారు. తండ్రి మృతితో ఆ చిన్నారులు అనాథలయ్యారు. ఈ ఘటనతో కుటుంబంలో తీవ్ర విషాదం నెలకొంది.ప్రమాద ఘటనపై చందానగర్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా ముందుకు సాగాలి

- జీకేఎస్ హాస్పిటల్‌ను ప్రారంభించిన బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు మారబోయిన రవి యాదవ్



సైబరాబాద్ విశాల భారతి: గచ్చిబౌలి స్ట్రీట్ నంబర్ 3లో నూతనంగా ఏర్పాటు చేసిన జీకేఎస్ హాస్పిటల్ ప్రారంభోత్సవం ఘనంగా జరిగింది. డాక్టర్ కుమార్ ప్రత్యేక ఆహ్వానం మేరకు శేరిలింగంపల్లి బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు మారబోయిన రవి యాదవ్ ముఖ్య అతిథిగా హాజరై ఆసుపత్రిని ప్రారంభించారు.ఈ సందర్భంగా డాక్టర్ కుమార్‌కు శుభాకాంక్షలు తెలిపిన రవి యాదవ్, ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడంలో జీకేఎస్ హాస్పిటల్ మంచి గుర్తింపు పొందాలని ఆకాంక్షించారు. అన్ని వర్గాల ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందిస్తూ ఆసుపత్రి మరింత అభివృద్ధి చెందాలని కోరుకున్నారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు, కార్యకర్తలు, ఆసుపత్రి నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

వేసవి తాగునీటి ఎద్దడి నివారణకు ముందస్తు చర్యలు చేపట్టాలి

- ఎల్-నినో ప్రభావంపై టేకులపల్లిలో ప్రత్యేక సమీక్ష సమావేశం

విశాల భారతి, మెదక్: ఎల్‌నినో ప్రభావంతో రానున్న వేసవిలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని చేగుంట ఎంపీడీవో చిన్న రెడ్డి అధికారులకు, గ్రామ సర్పంచ్‌లకు సూచించారు. ఇందులో భాగంగా గురువారం చేగుంట మండలం లోని కర్నాల పల్లి గ్రామం లొ సర్పంచ్ దుర్గ దేవి అధ్యక్షతన ఎల్‌నినో స్పెషల్ డ్రైవ్ నిర్వహణపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వేసవిలో గ్రామం లొ నిరంతర తాగునీటి సరఫరా జరిగేలా కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని సూచించారు. నీటి వనరుల సంరక్షణ, పైప్‌లైన్ లీకేజీల నివారణ, ఓవర్‌హెడ్ వాటర్ ట్యాంకుల (ఓహెచ్ఎస్ఆర్) మరమ్మతులు, క్లోరినేషన్, తాగునీటి నాణ్యత పరీక్షలపై చర్చించారు. గ్రామంలోని అన్ని ఆవాస ప్రాంతాలను క్షేత్రస్థాయిలో తనిఖీ చేసి, ఎక్కడా తాగునీటి సమస్య తలెత్తకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని పంచాయతీ కార్యదర్శులకు వివరించారు. అదేవిధంగా జలసిరి కార్యక్రమంపై అవగాహన కల్పించారు. ఈ సమావేశంలో ఎంపీడీఓ చిన్న రెడ్డి ఏపీఓ శ్వేతా, ఎంపీవో ప్రకాష్, వ్యవసాయ అధికారి హరి ప్రసాద్, హౌసింగ్ ఏఈ రియాజుద్దీన్, కార్యదర్శి పుష్పలత, ఉప సర్పంచ్ శివకుమార్, వార్డ్ సభ్యులు,వీబీజీ రామ్‌జీ సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్‌బీవీఆర్‌ఆర్ పోలీస్ అకాడమీకి ప్రతిష్ఠాత్మక ‘క్వాలిటీ మార్క్’ గుర్తింపు

- **అధికారులు, సిబ్బంది సమష్టి కృషికి దక్కిన గౌరవం: అకాడమీ డైరెక్టర్ అభిలాష్ బిస్త్, ఐపీఎస్**

రాజేంద్రనగర్, విశాల భారతి :



ప్రపంచ నాణ్యతా దినోత్సవం సందర్భంగా ఆర్‌బీవీఆర్‌ఆర్ తెలంగాణ పోలీస్ అకాడమీ మరో అరుదైన ఘనతను సాధించింది. పోలీస్ శిక్షణ, పచ్చదనం, పరిశుభ్రత, ఆహార నాణ్యత, పరిపాలన, మౌలిక సదుపాయాలు తదితర విభాగాల్లో అత్యుత్తమ ప్రమాణాలను పాటిస్తున్న అకాడమీకి ఐఎస్ఓ సంస్థ ప్రతిష్ఠాత్మకమైన ‘క్వాలిటీ మార్క్’ ధ్రువపత్రాన్ని అందజేసింది. దేశంలోని పోలీస్ శిక్షణ సంస్థల్లో ప్రత్యేకమైన ఐదు నక్షత్రాల రేటింగ్ సాధించిన సంస్థగా ఇప్పటికే గుర్తింపు పొందిన అకాడమీకి ఈ పురస్కారం మరో మైలురాయిగా నిలిచింది. ఈ నెల 10న ఎంసీఆర్ హెచ్‌ఆర్‌డీలో 112 మంది ప్రొబేషనరీ డీఎస్పీల శిక్షణ ముగింపు వేడుక సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి సమక్షంలో ఐఎస్ఓ మేనేజింగ్ డైరెక్టర్ ఆలపాటి శివయ్య ఈ ధ్రువపత్రాన్ని అకాడమీ డైరెక్టర్ అభిలాష్ బిస్త్, ఐపీఎస్‌కు అందజేశారు. ప్రపంచ నాణ్యతా దినోత్సవాన్ని పురస్కరించుకుని అకాడమీలో నిర్వహించిన వార్షిక నాణ్యతా తనిఖీల్లో భాగంగా ఐఎస్ఓ మేనేజింగ్ డైరెక్టర్ ఆలపాటి శివయ్య, నాణ్యతా విభాగం న్యాయ సలహాదారు సుందర్ రామయ్య వివిధ విభాగాలను క్షుణ్ణంగా పరిశీలించారు. గతంలోనే శిక్షణా ప్రమాణాలు, పచ్చదనం, పరిశుభ్రమైన ఆహార నిర్వహణ వంటి అంశాల్లో ఐఎస్ఓ ధ్రువపత్రాలు పొందిన అకాడమీ 2024లో ఐదు నక్షత్రాల రేటింగ్‌ను కూడా సాధించింది. ఈ సందర్భంగా అకాడమీ డైరెక్టర్ అభిలాష్ బిస్త్ మాట్లాడుతూ, నాలుగు దశాబ్దాలుగా పోలీస్ అధికారులకు అత్యుత్తమ శిక్షణ అందిస్తూ ఆర్‌బీవీఆర్‌ఆర్ తెలంగాణ పోలీస్ అకాడమీ దేశంలోనే ప్రముఖ శిక్షణ సంస్థగా గుర్తింపు పొందిందన్నారు. మారుతున్న పోలీసింగ్ అవసరాలు, నేరాల స్వరూపం, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానానికి అనుగుణంగా శిక్షణా విధానాలను నిరంతరం మెరుగుపరుస్తున్నామని తెలిపారు. అకాడమీలో ఇండోర్, ఔట్‌డోర్ శిక్షణతో పాటు పరిపాలన, పరిశుభ్రత, ఆహార భద్రత, పచ్చదనం, క్రీడలు, వైద్య సదుపాయాలు, మౌలిక వసతుల నిర్వహణలో అత్యున్నత ప్రమాణాలు పాటిస్తున్నామని వివరించారు. అకాడమీకి లభించిన అవార్డులు, కేంద్ర హోంశాఖ గుర్తింపులు, ఐఎస్ఓ ధ్రువపత్రాలు, ఐదు నక్షత్రాల రేటింగ్ వెనుక అధికారులు, బోధనా సిబ్బంది, ఉద్యోగుల సమష్టి కృషి ఉందని ప్రశంసించారు. తాజాగా లభించిన క్వాలిటీ మార్క్ గుర్తింపు కూడా ప్రతి ఒక్కరి అంకితభావానికి దక్కిన గౌరవమని పేర్కొన్నారు. ఐఎస్ఓ ప్రతినిధులు నిర్వహించిన తనిఖీల్లో భాగంగా పరిపాలనా కార్యాలయం, మోటారు రవాణా విభాగం, తరగతి గదులు, బోధనా సదుపాయాలు, శిక్షణా వసతులు, భోజనశాల, వైద్యశాల, క్రీడాభవనం, ఆయుధాల విభాగం, శిక్షణా మైదానాలను పరిశీలించారు. ఆయా విభాగాల ఇన్‌చార్జిలు అక్కడ అమలు చేస్తున్న నాణ్యతా ప్రమాణాలు, అందిస్తున్న సేవల వివరాలను ప్రతినిధులకు వివరించారు. నాణ్యతా దినోత్సవ వేడుకల్లో భాగంగా అకాడమీ ఆధ్వర్యంలో వినూత్నంగా ‘క్వాలిటీ హారం’ కార్యక్రమాన్ని నిర్వహించారు. అకాడమీ వాహనాలు, బుల్లెట్ మోటార్ సైకిళ్లతో నిర్వహించిన ఈ కార్యక్రమం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. నాణ్యత అనేది ఒక విభాగానికే పరిమితం కాకుండా సంస్థలోని ప్రతి విభాగం, ప్రతి ఉద్యోగి పనితీరులో ప్రతిబింబించాలనే సందేశాన్ని ఈ కార్యక్రమం ద్వారా చాటిచెప్పారు. ఈ కార్యక్రమంలో ఇండోర్ ఫ్యాకల్టీ డీఎస్పీ ఆదూరి శ్రీనివాసరావు, యూనిట్ వైద్యశాల వైద్యురాలు డాక్టర్ రమాదేవి, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు మహేష్, శ్రీనివాస్, మోటారు రవాణా విభాగం శ్రీరాజు, ఔట్‌డోర్ విభాగం సిబ్బంది, వివిధ విభాగాల ఇన్‌చార్జిలు పాల్గొన్నారు. నాణ్యత, క్రమశిక్షణ, పరిశుభ్రత, సమర్థవంతమైన శిక్షణ అనే నాలుగు ప్రధాన లక్ష్యాలతో ముందుకు సాగుతున్న ఆర్‌బీవీఆర్‌ఆర్ తెలంగాణ పోలీస్ అకాడమీకి లభించిన ఈ ప్రతిష్ఠాత్మక గుర్తింపు సంస్థ ప్రతిష్ఠను మరింత పెంచడంతో పాటు అధికారులు, సిబ్బందికి కొత్త ఉత్సాహాన్ని అందించనుంది. భవిష్యత్తులోనూ అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా శిక్షణా నాణ్యతను మరింత పెంచుతామని అకాడమీ డైరెక్టర్ అభిలాష్ బిస్త్ తెలిపారు.

యాసంగిలో వరి సాగు వద్దు.. ప్రత్యామ్నాయ పంటలే ముద్దు!

- **ఎల్‌నినో ముప్పుతో తీవ్ర వర్షా భావం.. రైతులు అప్రమత్తంగా ఉండాలి**
- **ఒక ఎకరా వరి నీటితో 2,3 ఎకరాల ఆరుతడి పంటలు సాగు చేయొచ్చు**
- **జిల్లా వ్యవసాయ అధికారి విజయచంద్ర: ఆత్మ చైర్మన్ నల్లు సుధాకర్ రెడ్డి**



సిరోలు విశాల భారతి జిల్లా స్టాఫ్ రిపోర్టర్: ఎల్‌నినో ప్రభావంతో యాసంగి సీజన్‌లో తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొనే అవకాశం ఉన్నందున రైతులు వరి సాగుకు స్వస్తి పలికి ప్రత్యామ్నాయ పంటల వైపు మళ్లాలని జిల్లా వ్యవసాయ అధికారి విజయచంద్ర, ఆత్మ చైర్మన్ నల్లు సుధాకర్ రెడ్డి పిలుపునిచ్చారు. సిరోలు మండలం చింతపల్లి గ్రామంలో నిర్వహించిన ఖేత్ బచావో అభియాన్, సూపర్ ఎల్‌నినో ప్రభావంపై రైతుల అవగాహన సదస్సులో వారు మాట్లాడుతూ.. జలాశయాల్లో నీటి నిల్వలు తగ్గడం, బోర్లు, బావులు ఎండిపోవడం, భూగర్భ జలాలు అడుగంటుతున్న నేపథ్యంలో యాసంగిలో వరి సాగు చేపట్టడం రైతులకు నష్టదాయకమని హెచ్చరించారు. ఒక ఎకరా వరి సాగుకు అవసరమయ్యే నీటితో రెండు నుంచి మూడు ఎకరాల్లో ఆరుతడి పంటలు సాగు చేయవచ్చని తెలిపారు. మొక్క జొన్న, నూనెగింజలు, పప్పుధాన్యాలు, కూరగాయల సాగుకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. అధిక రసాయన ఎరువులు, పురుగుమందుల వినియోగం, పంట వ్యర్థాలను కాల్చివేయడం వల్ల భూసారం దెబ్బతింటుందని పేర్కొన్నారు. రసాయనాల వినియోగాన్ని తగ్గించి సేంద్రియ వ్యవసాయాన్ని ప్రోత్సహించాలని కోరారు. అనంతరం రైతులకు పప్పుధాన్యాల విత్తనాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి ఛాయారాజ్, సర్పంచ్ వీరన్న, ఇరిగేషన్ ఏఈ నిఖిలేందర్, ఏఈవోలు వీరన్న, భరత్, మేఘ్ సురేష్, రైతులు పాల్గొన్నారు.

కెలోత్ బీకు కుటుంబానికి మాజీ మంత్రి సత్యవతి రాథోడ్ పరామర్శ

- **మృతుడి చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులు**



సీరోల్ విశాల భారతి జిల్లా స్టాఫ్ రిపోర్టర్: డోర్నకల్ నియోజకవర్గం సీరోల్ మండలం బిల్యా నాయక్ తండాకు చెందిన కెలోత్ బీకు ఇటీవల మృతి చెందడంతో, గురువారం ఆయన నివాసానికి వెళ్లిన మాజీ మంత్రి సత్యవతి రాథోడ్ కుటుంబ సభ్యులను పరామర్శించారు. ముందుగా బీకు చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను ఓదార్చి, ప్రగాఢ సానుభూతి తెలిపారు. కష్టకాలంలో కుటుంబానికి అండగా ఉంటామని భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో కురవి మండల మాజీ వైస్ ఎంపీపీ పెద్ద వెంకన్న గౌడ్, ఐలి నరహరి గౌడ్, బానోత్ హరి నాయక్, బోడ శ్రీను నాయక్, సర్పంచ్ ఎడ్ల శ్రీనివాస్ రెడ్డి, గుగులోత్ నెహ్రూ నాయక్, బాధే నాగయ్య, అర్జున్ చౌహాన్, స్థానిక సర్పంచ్ లలిత నెహ్రూ నాయక్, కేలోతు వెంకన్న, సక్రమ నాయక్ తండా సర్పంచ్ తేజావత్ బిక్షం, ఉపసర్పంచ్ మంజుల రవీందర్, కేలోతు రెడ్డి నాయక్, డి.వెంకన్న, బత్తిని వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

భూగర్భ జలాల సంరక్షణకు ఇంకుడు గుంతలు ఎంతో కీలకం

- **ప్రతి ఇంటి వద్ద ఇంకుడు గుంత నిర్మించుకోవాలి**
- **సర్పంచ్ వాంకుడోత్ సునీత కొమ్మలు నాయక్**



విశాలభారతి, గూడూరు: భూగర్భ జలాల సంరక్షణతో పాటు గ్రామంలో పారిశుద్ధ్యాన్ని మెరుగుపరిచేందుకు గూడూరు మేజర్ గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో ఇంకుడు గుంతల నిర్మాణ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. గూడూరు గ్రామంలోని గట్టి గౌర్ల నాగేష్, షేక్ మున్ని నివాసాల వద్ద ఏర్పాటు చేసిన ఇంకుడు గుంతల కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ శ్రీమతి వాంకుడోత్ సునీత కొమ్మలు నాయక్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ప్రతి ఇంటి ఆవరణలో ఇంకుడు గుంతలను నిర్మించుకోవడం ద్వారా వర్షపు నీటితో పాటు వృథా నీటిని భూమిలోకి ఇంకింపజేసి భూగర్భ జలాలను పెంపొందించుకోవచ్చని తెలిపారు. అదేవిధంగా వీధుల్లో మురుగునీరు నిల్వ ఉండకుండా నివారించడంతో గ్రామం పరిశుభ్రంగా ఉంటుందని, దోమల వ్యాప్తి తగ్గి సీజనల్ వ్యాధులను అరికట్టేందుకు అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. గ్రామ ప్రజలందరూ స్వచ్ఛందంగా ముందుకు వచ్చి తమ ఇళ్ల వద్ద ఇంకుడు గుంతలను నిర్మించుకోవాలని, భూగర్భ జలాల సంరక్షణలో భాగస్వాములై ఆదర్శ గూడూరు నిర్మాణానికి సహకరించాలని ఆమె పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ సత్యనారాయణ, గూడూరు ఉప సర్పంచ్ చంటి స్వామి, పంచాయతీ కార్యదర్శి తిరుమల, మండల కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ బీరం శ్రీపాల్ రెడ్డి, జిల్లా మైనార్టీ సెల్ కార్యదర్శి ఎండీ రసూల్, వార్డు సభ్యులు చీరబోయిన కుమార్, ధారావత్ కిషన్, ఫీల్డ్ అసిస్టెంట్ సదయ్య, టౌన్ కార్యదర్శి సూర శ్రీను, మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు రూపురెడ్డి వెంకటరెడ్డి, శివరాత్రి శ్రీను, రంజిత్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు. గ్రామ ప్రజలు కూడా కార్యక్రమంలో పాల్గొని ఇంకుడు గుంతల నిర్మాణానికి తమ మద్దతు తెలిపారు.

వలిగొండ రోడ్డులో దుమ్ము నివారణకు చైర్ పర్సన్ తక్షణ చర్యలు

- **హర్షం వ్యక్తం చేసిన స్థానిక వ్యాపారులు, వాహనదారులు**



చౌటుప్పల్,విశాలభారతి: చౌటుప్పల్ పట్టణంలోని వలిగొండ రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా ఈరోజు రోడ్డుపై వెట్ మిక్స్ వేయడం జరిగింది. అయితే, వాహనాల రద్దీ మరియు రాకపోకల కారణంగా విపరీతంగా దుమ్ము లేచి ప్రయాణికులు, స్థానిక వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయాన్ని ఏఈ మరియు స్థానిక వ్యాపారస్తులు మున్సిపల్ చైర్ పర్సన్ మొగుదాల పావని రమేష్ గౌడ్ దృష్టికి తీసుకువెళ్లారు. విషయం తెలిసిన వెంటనే స్పందించిన చైర్ పర్సన్, మున్సిపల్ వాటర్ ట్యాంకర్లను రప్పించి రోడ్డుపై నీటిని పిచికారీ చేయించారు. దీనివల్ల దుమ్ము సమస్య పూర్తిగా అదుపులోకి రావడంతో ప్రయాణికులకు, స్థానికులకు పెద్ద ఊరట లభించింది. సమస్య తెలిసిన వెంటనే స్పందించి తక్షణ చర్యలు తీసుకున్న చైర్ పర్సన్‌కు స్థానిక వ్యాపార సంస్థల యజమానులు, వాహనదారులు మరియు ప్రజలు ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతూ హర్షం వ్యక్తం చేశారు.

కాంగ్రెస్ నూతన కమిటీల ఏర్పాటుకు కసరత్తు!



చౌటుప్పల్,విశాల భారతి: తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ఆదేశాల మేరకు చౌటుప్పల్ మండల పరిధిలోని గ్రామ కాంగ్రెస్ కమిటీలను రద్దు చేస్తున్నట్లు మండల కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు బోయ దేవేందర్ ప్రకటించారు. మండల పరిధిలోని 26 గ్రామ పంచాయతీలకు సంబంధించిన గ్రామ కాంగ్రెస్ కమిటీలను రద్దు చేస్తూ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు. పార్టీని గ్రామస్థాయిలో మరింత బలోపేతం చేయడం, కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలు, ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లడం లక్ష్యంగా నూతన కమిటీల ఏర్పాటు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ఈ నెల 16112026 నుంచి మండలంలోని 26 గ్రామాల్లో నూతన గ్రామ కాంగ్రెస్ కమిటీల ఏర్పాటుకు చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు. గ్రామస్థాయిలో పార్టీకి నిబద్ధతతో పనిచేసే నాయకులు, కార్యకర్తలకు కమిటీల్లో ప్రాధాన్యత కల్పించనున్నట్లు పేర్కొన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేస్తూ కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని, గ్రామాల్లో పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మునుగోడు ఎన్నికల సమన్వయకర్త పబ్బు రాజు గౌడ్, చౌటుప్పల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఉబ్బు వెంకటయ్య, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు ఆకుల ఇంద్రసేనారెడ్డి, సింగిల్ విండో చైర్మన్ ఈద్దుల మస్తాన్ బాబు, ఆందోల్ మైసమ్మ దేవాలయ చైర్మన్ కంచర్ల అశ్విన్ రెడ్డి, జిల్లా కార్యదర్శి అర్ద వెంకటరెడ్డి, నూతన కార్యవర్గ సభ్యులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

అయ్యప్ప జ్యువెల్ షాప్ పేరుతో వినియోగదారులకు మోసం



విశాల భారతి, బోథ్ : బోథ్ పట్టణంలో అయ్యప్ప జ్యువెల్ షాప్ పేరుతో వినియోగదారుల నుంచి బంగారం, నగదు తీసుకొని మోసాలకు పాల్పడినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న రంగు రాము (45)ను బోథ్ పోలీసులు అరెస్ట్ చేశారు. నగల తయారీ, మరమ్మతుల పేరుతో కష్టమర్ల నమ్మకాన్ని ఆసరాగా చేసుకొని బంగారు ఆభరణాలు, నగదు తీసుకొని తిరిగి ఇవ్వకుండా మోసం చేసినట్లు బోథ్ సీఐ డి. సాయినాథ్ వెల్లడించారు. పోలీసుల వివరాల ప్రకారం బోథ్ పట్టణానికి చెందిన రంగు రాము గతంలో అయ్యప్ప జ్యువెల్ షాప్ నిర్వహించేవాడు. చెడు వ్యసనాలకు బానిసై సొంత అవసరాల కోసం విచ్చలవిడిగా డబ్బులు ఖర్చు చేయడంతో ఆర్థిక ఇబ్బందుల్లో పడ్డాడు. ఈ క్రమంలో తన వద్దకు నగలు తయారు చేయించుకోవడానికి, మరమ్మతుల కోసం వచ్చే వినియోగదారుల నుంచి బంగారం, నగదు తీసుకొని తిరిగి ఇవ్వకుండా మోసాలకు పాల్పడినట్లు పోలీసులు తెలిపారు. భారతి సమత అనే మహిళ వద్ద బంగారు గొలుసు తయారు చేసి ఇస్తానని రూ.45 వేలు తీసుకొని గొలుసు ఇవ్వకుండా, నగదు తిరిగి చెల్లించకుండా మోసం చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. అదేవిధంగా ముస్తాక్ అహ్మద్ షేక్ వద్ద రెండు జతల బంగారు కమ్మలు తయారు చేసి ఇస్తానని 9 గ్రాముల బంగారంతో పాటు రూ.15,050 తీసుకొని తిరిగి ఇవ్వకుండా మోసం చేసినట్లు పోలీసులు పేర్కొన్నారు. ఈ ఘటనకు సంబంధించి క్రైమ్ నంబర్ 277/2026 కింద కేసు నమోదైంది. మరో ఘటనలో మల్లారపు విజయ వద్ద 3 గ్రాముల బంగారు కమ్మలను మరమ్మతుల కోసం తీసుకొని తిరిగి ఇవ్వకుండా మోసం చేసినట్లు క్రైమ్ నంబర్ 278/2026 కింద కేసు నమోదు చేశారు. ఇదే తరహాలో మరికొందరు వినియోగదారులను కూడా మోసం చేసినట్లు విచారణలో వెల్లడైనట్లు పోలీసులు తెలిపారు. కష్టమర్ల నుంచి తీసుకున్న బంగారు ఆభరణాల్లో సుమారు 10 గ్రాముల బంగారు గొలుసు, ఆరు కమ్మలను బోథ్ పట్టణంలోని ముత్తూట్ ఫైనాన్స్‌లో తాకట్టు పెట్టి వచ్చిన డబ్బును వ్యక్తిగత అవసరాలకు వినియోగించినట్లు పోలీసులు వెల్లడించారు. అనంతరం పోలీసులకు పట్టుబడతాననే భయంతో రంగు రాము హైదరాబాద్‌కు పారిపోయినట్లు తెలిపారు. తిరిగి బోథ్‌కు వచ్చిన సమయంలో బస్టాండ్ వద్ద నిందితుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పంచుల సమక్షంలో పంచనామా నిర్వహించి నిందితుడి వద్ద నుంచి ఒప్పో మొబైల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా బోథ్ సీఐ డి. సాయినాథ్ మాట్లాడుతూ ప్రజలు తమ విలువైన బంగారు ఆభరణాలను నగల వ్యాపారులకు అప్పగించే సమయంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వినియోగదారుల నమ్మకాన్ని ఆసరాగా చేసుకొని మోసాలకు పాల్పడే వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

విద్యార్థుల భవిష్యత్తుతో ప్రయోగాలు చేయొద్దు

- **నలపరాజు రమేష్,బీఆర్ఎస్పీ మునుగోడు నియోజకవర్గ అధ్యక్షులు**

చౌటుప్పల్,విశాల భారతి:



తెలంగాణ రాష్ట్రంలో 202728 విద్యా సంవత్సరం నుంచి ప్రత్యేక ఇంటర్మీడియట్ విద్యా విధానాన్ని రద్దు చేసి, 10+2 విధానంలో భాగంగా ఇంటర్మీడియట్ విద్యను పాఠశాల విద్యలో విలీనం చేయాలనే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వ నిర్ణయంపై విద్యార్థులు, తల్లిదండ్రులు, విద్యారంగ నిపుణుల్లో అనేక సందేహాలు వ్యక్తమవుతున్నాయని బీఆర్ఎస్పీ మునుగోడు నియోజకవర్గ అధ్యక్షులు నలపరాజు రమేష్ అన్నారు. దశాబ్దాలుగా తెలంగాణ విద్యా వ్యవస్థలో ప్రత్యేక గుర్తింపు కలిగిన ఇంటర్మీడియట్ విద్యా విధానాన్ని ఇంత కీలకమైన మార్పుతో ముందుకు తీసుకెళ్లే ముందు విద్యార్థులు, అధ్యాపకులు, తల్లిదండ్రులు, విద్యారంగ నిపుణులతో విస్తృత స్థాయిలో చర్చించాల్సిన అవసరం ఉందని ఆయన అభిప్రాయపడ్డారు.

ఈ నిర్ణయం వల్ల తలెత్తే ప్రశ్నలకు ప్రభుత్వం సమాధానం చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రభుత్వం సమాధానం ఈ ప్రశ్నలకు సమాధానం చెప్పాలిందే

గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న ప్రభుత్వ జూనియర్ కళాశాలల భవిష్యత్తు ఏమిటి?

ఇంటర్మీడియట్ విద్యార్థులకు బోధిస్తున్న అధ్యాపకుల పరిస్థితి ఏమిటి?

పేద, మధ్యతరగతి విద్యార్థులకు అందుబాటులో ఉన్న విద్యా అవకాశాలు తగ్గకుండా ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకుంటుంది?

సైన్స్ విద్యార్థులకు అవసరమైన ప్రయోగశాలలు, ప్రత్యేక బోధనా సదుపాయాలు ఎలా కల్పిస్తారు?


ఇంటర్మీడియట్ స్థాయిలో విద్యార్థులు ఎంచుకునే ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, ఎంఈసీ వంటి గ్రూపుల బోధనలో నాణ్యతను ఎలా కొనసాగిస్తారు?

కేవలం సీబీఎస్ఈ, ఐసీఎస్ఈ పాఠశాలల తరహాలో విద్యా విధానాన్ని మార్చడం వల్లే నాణ్యమైన విద్య అందుతుందని భావించడం సరైంది కాదని రమేష్ అన్నారు. ముందుగా ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు, నాణ్యమైన బోధన, సరిపడా అధ్యాపకుల నియామకం వంటి అంశాలపై ప్రభుత్వం దృష్టి పెట్టాలని సూచించారు. విద్యా సంస్కరణలు అవసరమేనని, కానీ ఆ సంస్కరణలు విద్యార్థులకు మరిన్ని అవకాశాలు కల్పించాలని తప్ప, ఇప్పటికే అందుబాటులో ఉన్న విద్యా వ్యవస్థపై అనిశ్చితిని సృష్టించకూడదని ఆయన పేర్కొన్నారు. ప్రత్యేక ఇంటర్మీడియట్ విద్యా విధానాన్ని విలీనం చేసే నిర్ణయాన్ని ప్రభుత్వం పునఃపరిశీలించాలని, విద్యార్థులు, అధ్యాపకులు, తల్లిదండ్రుల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకున్న తర్వాతే తుది నిర్ణయం తీసుకోవాలని ఆయన కోరారు. విద్యార్థుల భవిష్యత్తు రాజకీయ ప్రయోగాలకు వేదిక కాకూడదని, తెలంగాణ విద్యార్థులకు నాణ్యమైన విద్య, సమాన అవకాశాలు కల్పించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యం కావాలని నలపరాజు రమేష్ అన్నారు.

రెవెన్యూ గ్రామ పంచాయతీలుగా గుర్తించాలి

- **ఏజెన్సీ చట్టాలను పరిరక్షించాలి.. LHPS రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తేజావత్ వాసు నాయక్**

విశాల భారతి, గూడూరు : తెలంగాణ రాష్ట్రంలోని తండా పంచాయతీలను రెవెన్యూ గ్రామ పంచాయతీలుగా గుర్తించి, ఒక్కో పంచాయతీకి రూ.కోటి నిధులు కేటాయించాలని లంబాడి హక్కుల పోరాట సమితి (LHPS) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తేజావత్ వాసు నాయక్ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. గురువారం గూడూరు మండల కేంద్రంలో లంబాడి హక్కుల పోరాట సమితి మండల స్థాయి నాయకులతో నిర్వహించిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రంలో తండా పంచాయతీలకు ఇప్పటివరకు పూర్తిస్థాయి రెవెన్యూ గ్రామ పంచాయతీల గుర్తింపు లభించలేదని, ప్రభుత్వం తక్షణమే స్పందించి ఆయా పంచాయతీలకు రెవెన్యూ హోదా కల్పించడంతో పాటు అభివృద్ధి కోసం ఒక్కో పంచాయతీకి రూ.కోటి నిధులు విడుదల చేయాలని కోరారు. పోడు రైతులకు న్యాయం చేయాలి. ఏజెన్సీ ప్రాంతాల్లో పోడు వ్యవసాయం చేస్తున్న రైతులకు అటవీ హక్కుల చట్టం (ROFR) కింద హక్కు పత్రాలు మంజూరు చేసినప్పటికీ, కొన్ని పాస్ పుస్తకాలు బ్యాంకు రుణాలకు ఉపయోగపడటం లేదని వాసు నాయక్ ఆవేదన వ్యక్తం చేశారు. డీఎల్సీలో అమలు కాని పాస్ పుస్తకాల సమస్యను పరిష్కరించి, అర్హులైన రైతులకు బ్యాంకు రుణాలు అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే ఎల్‌నినో ప్రభావంతో పంటలు నష్టపోయి, సాగునీటి సౌకర్యాలు లేక ఇబ్బందులు పడుతున్న ఏజెన్సీ ప్రాంత రైతులకు ప్రతి ఎకరాకు రూ.50 వేల చొప్పున ఆర్థిక సహాయం అందించాలని ప్రభుత్వాన్ని కోరారు.ఏజెన్సీ చట్టాల అమలులో అధికారుల బాధ్యత కీలకం. ఏజెన్సీ ప్రాంతాల్లో అమలులో ఉన్న చట్టాలను కాపాడాల్సిన బాధ్యత అధికారులపై ఉందని, గ్రామసభల తీర్మానాలు లేకుండా అక్రమాలు చోటుచేసుకుంటున్నాయని ఆరోపించారు. జిల్లా కలెక్టర్ ప్రత్యేక దృష్టి సారించి ఏజెన్సీ చట్టాలు గిరిజన ప్రజలకు ఉపయోగపడేలా పటిష్టమైన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.



నవంబర్ 20న గూడూరులో LHPS మండల సభ

లంబాడి సమాజం ఎదుర్కొంటున్న సమస్యలకు శాశ్వత పరిష్కారాలు సాధించడం, రాజ్యాంగబద్ధమైన హక్కులను పరిరక్షించడం లక్ష్యంగా నవంబర్ 20న గూడూరు మండల కేంద్రంలో LHPS ఆధ్వర్యంలో మండల స్థాయి సభ నిర్వహించాలని నిర్ణయించినట్లు తెలిపారు. ఈ సభకు ప్రజాప్రతినిధులు, మేధావులు, యువత, ఉద్యోగులు, ప్రజాసంఘాల ప్రతినిధులు, బంజారా మరియు లంబాడి సమాజానికి చెందిన ప్రజలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సభ కేవలం సమావేశానికే పరిమితం కాకుండా, లంబాడీ సమాజ హక్కుల సాధనకు ఐక్య కార్యాచరణకు వేదిక కావాలని ఆకాంక్షించారు. సేవాలాల్ మందిర నిర్మాణం, టాను నాయక్ విగ్రహ ప్రతిష్ఠపై నిర్ణయం గూడూరు మండల కేంద్రంలో సేవాలాల్ మహారాజ్ మందిర నిర్మాణం కోసం భూసేకరణ చేపట్టే అంశంతో పాటు, తెలంగాణ రైతాంగ పోరాటంలో అసువులు బాసిన టాను నాయక్ విగ్రహ ప్రతిష్ఠాపనపై కూడా ఈ సభలో నిర్ణయం తీసుకోనున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య జగన్ నాయక్, బాలు నాయక్, సుందర్ నాయక్, రెడ్యా నాయక్, శీను నాయక్, హరి నాయక్, వెంకన్న నాయక్, రమేష్ నాయక్, దీవిలాల్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

సిసి రోడ్స్ నిర్మాణం కోసం భూమి పూజ

- **ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి**



నిజామాబాద్, విశాలభారతి: మాక్లూర్ మండలంలోని మాణిక్ బండ రెండు డివిజన్ ఆర్మూర్ నియోజవర్గ ఎమ్మెల్యే గురువారం నాడు నిజాంబాద్ మున్సిపల్ పరిధిలోని మాణిక్ బందర్ లో 20 లక్షలతో నిర్మిస్తున్న సిసి డ్రైనేజీ పనులను మేయర్ తో కలిసి పూజ కార్యక్రమంలో పాల్గొన్నారు . ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నిజామాబాద్ కార్పొరేషన్ కు 200 కోట్లు కేటాయించాలని కొడంగల్ కు కేటాయించినట్లే నిజామాబాద్ కూడా కేటాయించాలని వేడుకుంటున్నానని, డిమాండ్ చేస్తున్నానని ప్రార్థిస్తున్నానని మూడు విధాలుగా తెలుపుతున్నానని ఎమ్మెల్యే అన్నారు మున్సిపల్ శివారు గ్రామాలలో పారిశుద్ధ్య పనులు సక్రమంగా జరగడం లేదని మున్సిపల్ అధికారులు దానిని చూడాలని కోరడం జరిగింది ఈ కార్యక్రమంలో మున్సిపల్ 2వ కార్పొరేటర్ మోహన్, బిజెపి మండల అధ్యక్షురాలు మమత, శివలాల్, శ్రీనాథ్, మామిడిపల్లి రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

కామారెడ్డి బస్టాండ్‌లో సెల్ ఫోన్ చోరీ బాలుడు అరెస్ట్

విశాలభారతి, కామారెడ్డి ; కామారెడ్డి కొత్త బస్టాండ్ లో ప్రయాణికుల రద్దీని ఆసరాగా చేసుకుని సెల్ఫోన్ల దొంగతనాలకు పాల్పడుతున్న 15 ఏళ్ల మైనర్ బాలుడిని కామారెడ్డి పట్టణ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. బస్టాండ్లో ప్రయాణికులను లక్ష్యంగా చేసుకుని ఒకరి ఫోన్ను దొంగిలించడంతో పాటు, మరో ప్రయాణికుడిపై వెనుక నుంచి దాడి చేసి, బెదిరించి మొబైల్ ఫోన్ను బలవంతంగా లాక్కెళ్లిన ఘటనలో నిందితుడిని గుర్తించి పట్టుకున్నారు. అతడి వద్ద నుంచి రెండు మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. జిల్లా ఎస్పీ రాజేష్ చంద్ర, వెల్లడించిన వివరాల ప్రకారం.. ఈ నెల 8వ తేదీన కామారెడ్డి కొత్త బస్టాండ్ లో ఇద్దరు ప్రయాణికులను లక్ష్యంగా చేసుకుని మైనర్ బాలుడు చోరీకి పాల్పడ్డాడు. ఒక ప్రయాణికుడి మొబైల్ ఫోన్‌ను దొంగిలించగా, మరో ప్రయాణికుడిపై దాడి చేసి, బెదిరించి అతని వద్ద ఉన్న పోకో ఎం3 (3) మొబైల్ ఫోన్ లు లాక్కుని అక్కడి నుంచి పరారయ్యాడు. బాధితుల ఫిర్యాదు మేరకు పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

మహాసభలను జయప్రదం చేయాలి

ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి

మోతె , విశాలభారతి:

ఈ నెల 15 నుండి 18 వరకు నల్లగొండ జిల్లా కేంద్రంలో జరిగే అఖిలభారత రైతు సంఘం (ఏ ఐ కె ఎస్) 36వ జాతీయ మహాసభలను జయప్రదం చేయాలని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి రైతులకు పిలుపునిచ్చారు. గురువారం మండల పరిధిలోని సిరికొండ గ్రామంలో అఖిల భారత కిసాన్ సభ 36వ జాతీయ మహాసభలను విజయవంతం చేయాలని కోరుతూ ఇంటింటా ప్రచారాన్ని ఆమె ప్రారంభించి మాట్లాడారు. దేశానికి అన్నం పెట్టే రైతన్న నేడు అనేక సమస్యలతో సతమతమవుతున్నాడని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులను ఆదుకోవాల్సిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతుల ప్రయోజనాలను విస్మరించి కార్పొరేట్ శక్తులకు వ్యవసాయ భూములను అప్పగించే విధానాలను అనుసరిస్తున్నాయని విమర్శించారు.రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించడంలో ప్రభుత్వాలు నిర్లక్ష్యం వహిస్తున్నాయని, పెట్టుబడి ఖర్చులు రోజు రోజుకూ పెరుగుతున్నా అందుకు అనుగుణంగా పంటలకు ధరలు లభించడం లేదని అన్నారు. రైతులకు స్వామినాథన్ కమిషన్ సిఫార్సుల ప్రకారం కనీస మద్దతు ధర కల్పించాలని, పంటల కొనుగోలుకు సమగ్ర వ్యవస్థ ఏర్పాటు చేయాలని, నకిలీ విత్తనాలు, ఎరువుల కొరతను అరికట్టాలని, రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు సకాలంలో అందించాలని డిమాండ్ చేశారు.రైతుల రుణభారాన్ని తగ్గించి సమగ్ర రుణమాఫీ అమలు చేయాలని, ప్రకృతి వైపరీత్యాలతో పంటలు నష్టపోయిన రైతులకు తగిన నష్టపరిహారం అందించాలని, వ్యవసాయ రంగాన్ని



కార్పొరేట్ శక్తుల చేతుల్లోకి వెళ్లకుండా కాపాడాలని ప్రభుత్వాలను కోరారు.రైతాంగ సమస్యల పరిష్కారం కోసం అఖిలభారత రైతు సంఘం నిరంతరం పోరాటాలు నిర్వహిస్తోందని, అ పోరాటాల రూపకల్పనకై ఈనెల 15 నుండి 18 వరకు నల్లగొండ జిల్లా కేంద్రంలో జరిగే 36వ జాతీయ మహాసభలు కీలక వేదికగా నిలవనున్నాయని తెలిపారు. నవంబర్ 15వ తేదీన నల్లగొండ జిల్లా కేంద్రంలో ఎన్జీ కళాశాల మైదానంలో రైతు గర్జన బహిరంగ సభ ఉంటుందని అన్నారు. ఈ సభకు ముఖ్య అతిథిగా మాజీ పార్లమెంటు సభ్యురాలు బృందాకరత్ హాజరవుతున్నారని ఈ సభకు రైతులు, కూలీలు, వ్యవసాయ కార్మికులు, ప్రజాస్వామిక వాదులు పెద్ద సంఖ్యలో సభలో పాల్గొని బహిరంగ సభను జాతీయ మహాసభలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

సిపిఎం లో చేరిక..

సిరికొండ గ్రామంలో సిపిఎం పార్టీ చేస్తున్న ప్రజా పోరాటాలకు ఆకర్షితులై న యువకుడు నవిలే ఉపేందర్ సిపిఎం పార్టీలో చేరారు. వారికి ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి సిపిఎం కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన కార్యకర్తల‌ను కంటికి రెప్పలా కాపాడుకుంటామని అన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మట్టిపల్లి సైదులు, సిఐటియు మండల నాయకులు కాంపాటి శ్రీను,ప్రజానాట్యమండలి జిల్లా నాయకులు పి డమర్తి అశోక్, రైతు సంఘం నాయకులు మీసాల వెంకన్న, డివైఎఫ్ఐ మండల కార్యదర్శి వెలుగు మధు, ఐద్వా మండల నాయకురాలు కాంపాటి నాగమ్మ, బొర్రా మైసయ్య, మాము నూరి నారాయణ, వేల్పుల వెంకన్న, కాంపాటి వెంకయ్య, బొర్ర వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

కమిటీలను సర్పంచ్ అధ్యక్షతన ఏర్పాటు చేయాలి

- కలెక్టర్‌కు చౌటుప్పల్,నారాయణపురం సర్పంచుల వినతి పత్రం



చౌటుప్పల్, విశాలభారతి: యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్,నారాయణపురం మండలాల సర్పంచులు మరియు పాలకవర్గ సభ్యులు జిల్లా కలెక్టర్ ను కలిసి వినతి పత్రం అందజేశారు. సర్వేల్ గురుకుల పాఠశాల సందర్శనలో భాగంగా విచ్చేసిన జిల్లా కలెక్టర్ ను సర్పంచులు కలిసి ఈ వినతి పత్రం అందజేశారు. గ్రామపంచాయతీ ఎన్నికల ముందు వేసిన ఇందిరమ్మ కమిటీలను రద్దు పరుస్తూ, నూతనంగా ఎన్నికైన సర్పంచులను ఇందిరమ్మ ఇండ్లు రెండో విడత సెలక్షన్ కమిటీ చైర్మన్ గా, సర్పంచ్ అధ్యక్షతన పాలకవర్గ సభ్యులతో కలుపుకుని నూతన కమిటీ ఏర్పాటు చేయాలని కోరారు. ఈ మేరకు చౌటుప్పల్ మండల ఫోరం అధ్యక్షులు సుర్వి మల్లేష్ గౌడ్, సర్పంచ్ అంకిరెడ్డిగూడెం అధ్యక్షతన చౌటుప్పల్,నారాయణపురం 2 మండలాల సర్పంచులు మరియు పాలకవర్గ సభ్యులు సమావేశమై ఏకగ్రీవంగా తీర్మానం చేసుకున్నారు.పంచాయతీరాజ్ 2018 చట్టం ప్రకారం సర్పంచుల విధులు,బాధ్యతలలో భాగంగా గ్రామ అభివృద్ధి,సంక్షేమం దృష్ట్యా గ్రామ సర్పంచ్ అధ్యక్షతన గ్రామాలలో నూతన ఇందిరమ్మ కమిటీలను ఏర్పాటు చేసుకునేందుకు అనుమతులు ఇప్పించాలని తమ ద్వారా ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో గిర్కంటి నిరంజన్ గౌడ్, కైరంకొండ స్వప్న అశోక్, టేకుల మంజుల, తంగేళ్ల వెంకటేశం, గుండెబోయిన శిరీష ఇస్తారీ, బక్కతట్ల రాధిక శ్రీశైలం, సమ్మిరెడ్డి భారతమ్మ జనార్దన్ రెడ్డి, సుర్వి సౌజన్య రాజు గౌడ్, ఉప్పల రమేష్‌గౌడ్, సుర్కంటి శ్రీధర్ రెడ్డి, చిన్నం బాలరాజ్ తదితర వివిధ గ్రామాల సర్పంచులు,పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.

తంగడపల్లిలో 5, 6వ వార్డుల నూతన బూత్ కమిటీల ఏర్పాటు



చౌటుప్పల్, విశాలభారతి: చౌటుప్పల్ మున్సిపాలిటీ కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో, మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి సూచనలు, డీసీసీ కమిటీ ఆదేశాల మేరకు, మున్సిపల్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు కాసర్ల శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో తంగడపల్లిలో 5, 6వ వార్డుల నూతన బూత్ కమిటీల ఏర్పాటు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా 5వ వార్డు అధ్యక్షుడిగా బండి చంటి ముదిరాజ్, 6వ వార్డు అధ్యక్షుడిగా రావుల ఊషయ్య ఎన్నికయ్యారు. వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఉబ్బు వెంకటయ్య మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేయడంతో పాటు కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు, చౌటుప్పల్ వ్యవసాయ మార్కెట్ కమిటి వైస్ చైర్మన్ ఆకుల ఇంద్రసేన రెడ్డి, మాజీ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు మొగుదాల రమేష్ గౌడ్, డీసీసీ కార్యదర్శి బత్తుల లింగస్వామి గౌడ్, 6వ వార్డు ఇన్‌చార్జి, సింగిల్ విండో డైరెక్టర్ రావుల స్వామి, 5వ వార్డు ఇన్‌చార్జి కొండూరి ధర్మేంద్ర. మున్సిపల్ కమిటీ సభ్యులు: ఇప్ప వెంకటేశం, ఎర్రగొని లింగస్వామి యాదవ్, సామకూర యాదయ్య, బండమీది మల్లేష్, అంతటి బాలరాజు, వర్కాల వెంకటకుమార్, సయ్యద్ వయ్యూద్దీన్, కారేదర్శి గుండెబోయిన ఐలయ్య యాదవ్, ఓర్సు రాజు,కేతరాజు అచ్చయ్య, కొండూరు వెంకటయ్య, సామకూర రాజయ్య, బాలగొని వెంకటేశం, బొజ్జ బుచ్చయ్య, పండుల రాజేశ్, ముస్కు శ్యాంసుందర్ రెడ్డి, బెడదం లింగస్వామి, కేతరాజు గోపాలు, మహేష్, శ్రీకాంత్, కొల్కులపల్లి రాజశేఖర్, అనమోని వెంకటేశం, నక్క వెంకటేశం, నక్క శ్రీను, గట్టు వెంకటేశం, ఊదరి సురేష్, బండి రాజు, ఎర్రబోతు శేఖర్ రెడ్డి, బైరు సాయిరాం, వర్కాల శ్రీకాంత్, చిత్రాల రాజు, శ్యామల అనిల్, దోసపాటి శ్రీకాంత్, అనమోని రవి, అనమోని సంజీవ, ఎండీ సోయల్, ఎండీ ఇమ్రాన్, ఎండీ అబ్బాస్, కేతరాజు వెంకటయ్య, కర్తాల చంద్రయ్య, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

నవంబర్ 15న నల్లగొండ రైతు మహాసభకు తరలిరావాలి


- మోడీ హయాంలో వ్యవసాయ రంగం నిర్వీర్యమవుతోంది
- రైతులు, వ్యవసాయ కార్మికులు, దళితులు, గిరిజనులకు అల్వాల వీరయ్య పిలుపు



మరిపెడ విశాల భారతి: నవంబర్ 15న నల్లగొండలో నిర్వహించనున్న అఖిలభారత రైతు మహాసభ బహిరంగ సభకు రైతులు, కార్మికులు, వ్యవసాయ కూలీలు, దళితులు, గిరిజనులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి అల్వాల వీరయ్య పిలుపునిచ్చారు.గురువారం మరిపెడ మండలం ఎల్లంపేట గ్రామంలో సభ విజయవంతం కోసం ప్రచార కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా వీరయ్య మాట్లాడుతూ రైతాంగ హక్కులు, వ్యవసాయ రంగ పరిరక్షణ కోసం దేశవ్యాప్తంగా రైతు మహాసభలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన మూడు వ్యవసాయ చట్టాలకు వ్యతిరేకంగా 13 నెలల పాటు సాగిన చారిత్రాత్మక రైతు ఉద్యమంలో అఖిల భారత కిసాన్ సభ కీలక పాత్ర పోషించిందన్నారు.జిల్లాలో ఎస్సారెస్పీ ఉపకాల్వలైన గన్నవరం, తీగలవేణి కాలువలను అనేక సంవత్సరాల పోరాట ఫలితంగా సాధించుకున్నామని పేర్కొన్నారు. ఎల్‌నినో ప్రభావంతో వర్షాలు తగ్గి పంట దిగుబడులు పడిపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.మహబూబాబాద్ జిల్లాను కరువు ప్రాంతంగా ప్రకటించి, నష్టపోయిన పంటలకు ఎకరాకు రూ.30 వేల చొప్పున పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ కూలీలకు 200 రోజుల ఉపాధి హామీ పని కల్పించి, రోజువారీ వేతనం రూ.600 చెల్లించాలని కోరారు. 2025 విద్యుత్ సవరణ బిల్లు వల్ల రైతులకు విద్యుత్ సరఫరాపై ఇబ్బందులు తలెత్తే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో రైతు సంఘం మండల అధ్యక్షుడు తాడూరు వీరెంకులు, స్థానిక సంఘం నాయకులు అల్వాల పురుషోత్తం, తాడూరి యాకయ్య, వ్యవసాయ కూలీల గుంపు మేస్త్రీలు, తదితరులు పాల్గొన్నారు.

డ్రైనేజీ సమస్యల పరిష్కారానికి అధికారుల క్షేత్రస్థాయి పర్యటన

మేడిపల్లి: విశాల భారతి: మేడిపల్లి డివిజన్ పరిధిలోని ధరణి కాలనీలో నెలకొన్న రోడ్లు, డ్రైనేజీ సమస్యలపై బుధవారం జోనల్ కమిషనర్ మరియు డిప్యూటీ కమిషనర్ కు ఫిర్యాదు చేశారు. ఈ విషయంపై డీసీసీ అధ్యక్షులు వజ్రేష్ యాదవ్ ప్రత్యేక చొరవ, అధికారుల సమన్వయంతో గురువారం క్షేత్రస్థాయి పరిశీలన చేపట్టారు. మేడిపల్లి డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తుంగతుర్తి రవి. డిప్యూటీ కమిషనర్ శైలజ ధరణి కాలనీలో పర్యటించారు. కాలనీ వాసులతో కలిసి తిరుగుతూ, అక్కడ నెలకొన్న రోడ్లు, డ్రైనేజీ దుస్థితిని వారు స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా కాలనీ వాసులు తమ ఇబ్బందులను అధికారుల దృష్టికి తీసుకురాగా, సమస్యలను త్వరలోనే పరిష్కరిస్తామని డిప్యూటీ కమిషనర్ శైలజ హామీ ఇచ్చారు. *ఈ సందర్భంగా తుంగతుర్తి రవి మాట్లాడుతూ*.ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా మౌలిక వసతుల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తామని తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారమే తమ ప్రధాన లక్ష్యమని, కాలనీ అభివృద్ధికి ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటామని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో AE సాయి కిరణ్, work inspector లింగస్వామి,ధరణి కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు, మరియు కమిటీ సభ్యులు, కాలనీ వాసులు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ సమస్యలను వివరించారు.



ముదిరాజ్‌లను బీసీ డీ నుంచి బీసీ ఏలోకి మార్చే హామీని వెంటనే అమలు చేయాలి




- వచ్చే నెలలోగా సమస్యలు పరిష్కరించకపోతే పది లక్షల మందితో భారీ బహిరంగ సభ
- ఓయూ విద్యార్థి నాయకురాలు అనిత ముదిరాజ్

ముషీరాబాద్ విశాల భారతి:

ముదిరాజ్ సామాజిక వర్గాన్ని బీసీ డీ నుంచి బీసీ ఏ లోకి మారుస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీని వెంటనే అమలు చేయాలని ఓయూ విద్యార్థి నాయకురాలు అనిత ముదిరాజ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాలలో ముదిరాజుల ఆత్మీయ సమ్మేళనం జరిగింది. ఈ సందర్భంగా అనిత మాట్లాడుతూ ముదిరాజ్ సామాజిక వర్గానికి బీసీ ఏ రిజర్వేషన్ కల్పిస్తామని ప్రభుత్వం ఇచ్చిన హామీని కార్యరూపంలోకి తీసుకురావాలని కోరారు. ముదిరాజ్‌లకు సామాజికంగా, విద్యాపరంగా, రాజకీయంగా తగిన ప్రాధాన్యత కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. కోకాపేటలో ముదిరాజ్ సామాజిక వర్గం కోసం ప్రత్యేక భవనాన్ని నిర్మించాలని, నీలం మదన్‌కు ప్రభుత్వంలో తగిన పదవి కల్పించాలని విజ్ఞప్తి చేశారు.అదేవిధంగా బీఆర్ఎస్ పార్టీ ముదిరాజ్ నాయకుడు వీరేశంకు టికెట్ కేటాయించడాన్ని స్వాగతిస్తున్నట్లు తెలిపారు. రాజకీయాలకు అతీతంగా ముదిరాజ్‌లందరూ ఐక్యంగా ఉండి సామాజిక హక్కులు, అభివృద్ధి కోసం సమిష్టిగా పోరాడాలని పిలుపునిచ్చారు. కేవలం హామీలకే పరిమితం కాకుండా ముదిరాజ్ సామాజిక వర్గం ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.రాష్ట్రప్రభుత్వం వచ్చే నెలలోగా తమ ప్రధాన డిమాండ్లను పరిష్కరించకపోతే రాష్ట్రవ్యాప్తంగా ముదిరాజ్‌లను ఏకతాటిపైకి తీసుకొచ్చి పది లక్షల మందితో భారీ బహిరంగ సభ నిర్వహిస్తామని హెచ్చరించారు. ముదిరాజ్ సామాజిక వర్గ ఐక్యతను, తమ జనబలాన్ని చాటిచెప్పేలా ఉద్యమ కార్యాచరణ రూపొందిస్తామని స్పష్టం చేశారు. ప్రభుత్వం తమ డిమాండ్లపై సానుకూలంగా స్పందించి ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరారు.

పండెన్ వాగు పరిరక్షణకు సమగ్ర విచారణ చేపట్టాలి




రాజేంద్రనగర్, విశాల భారతి :

పండెన్ వాగు పరిరక్షణకు సంబంధించి చేపడుతున్న పనులపై సమగ్ర విచారణ జరిపించాలని పండెన్ వాగు పరిరక్షణ సమితి డిమాండ్ చేసింది. సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన నిజ నిర్ధారణ కమిటీ పరిశీలనలో స్థానిక ప్రజలు పెద్దఎత్తున పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్టార్మ్ వాటర్ డ్రైన్ల పేరుతో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులు చేపడుతున్నారనే అనుమానాలు వ్యక్తమయ్యాయి. గతంలో హ్యూడా కాలనీ నుంచి ఎంప్లాయీస్ కాలనీ వరకు, ఆర్కా టీం 4 బిల్డర్ నుంచి లక్ష్మీనగర్ కాలనీ మీదుగా అంజలి గార్డెన్స్ నుంచి ఎల్ఐసీ కాలనీ రోడ్డు వరకు, అలాగే అలకాపూర్ టౌన్‌షిప్ రోడ్ నంబర్ 30, గోల్డెన్ టెంపుల్ పరిసర ప్రాంతాల్లో స్టార్మ్ వాటర్ డ్రైన్ల పేరుతో మురుగునీటి పారుదల పనులు చేపట్టినట్లు సమితి ఆరోపించింది. ఈ పనుల విషయంలో మున్సిపల్ ఇంజినీరింగ్ అధికారుల వ్యవహారశైలిపై అనుమానాలు ఉన్నాయని, స్థానిక కాంగ్రెస్ నాయకులు ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారనే అభిప్రాయాలు ప్రజల్లో వ్యక్తమవుతున్నాయని పేర్కొంది. పర్యావరణ పరిరక్షణకు సంబంధించిన ప్రజల అభ్యంతరాలను తప్పించుకునేందుకే పనుల పేర్లను మార్చి చూపిస్తున్నారనే ఆందోళనలను సమితి వ్యక్తం చేసింది. ఆయా పనులకు సంబంధించిన టెండర్లు, సాంకేతిక నిబంధనలు, అంచనాలు, అనుమతులు, పనుల అమలుపై సమగ్ర విజిలెన్స్ విచారణ చేపట్టాలని డిమాండ్ చేసింది. తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి, హైదరాబాద్ మహానగర అభివృద్ధి సంస్థ అధికారులు ఈ వ్యవహారంపై ప్రత్యేక దృష్టి సారించి పర్యవేక్షణలో జరిగిన నిర్లక్ష్యం, నిబంధనల ఉల్లంఘనలపై విచారణ జరపాలని కోరింది. విచారణ పూర్తయ్యే వరకు నిబంధనలకు విరుద్ధంగా జరుగుతున్నట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న పనులను నిలిపివేయాలని స్పష్టం చేసింది. వర్షపు నీటి కాలువలను కేవలం వర్షపు నీటి తరలింపునకే వినియోగించాలని, మురుగునీటి పారుదల వ్యవస్థల నిర్మాణానికి వాటిని మునుగుగా ఉపయోగించకూడదని సమితి పేర్కొంది. పర్యావరణ పరిరక్షణ, ప్రజా ప్రయోజనాలు, ప్రభుత్వ పనుల్లో పారదర్శకతకు ప్రాధాన్యత ఇవ్వాలని, ప్రజలను తప్పుదోవ పట్టించినట్లు తేలితే బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పండెన్ వాగు పరిరక్షణ సమితి డిమాండ్ చేసింది.

విద్యుత్ అధికారులకు రూ.27,912 జరిమానా..

ఫారెస్ట్ రేంజ్ అధికారి వాసుదేవ్

విశాల భారతి, కామారెడ్డి ; నాగిరెడ్డిపేట మండలం బంజారా తండా నుంచి తాండూర్ గేటు వరకు రిజర్వ్ ఫారెస్ట్ నీ ఎలక్ట్రిక్ లైన్ కింద విద్యుత్ శాఖ వారు విచక్షణారహితంగా చెట్లను నరికినందుకు రూ.27,912 జరిమానా విధించినట్లు ఫారెస్ట్ రేంజ్ అధికారి వాసుదేవ్ తెలిపారు. విద్యుత్ అధికారులు అనుమతి తీసుకొని లైన్ కింద ఉన్న చెట్ల కొమ్మలను మాత్రమే నరకాల్సి ఉంటుందని ఆయన పేర్కొన్నారు.



ఆరుతడి పంటల సాగుకు ప్రాధాన్యం ఇవ్వాలి

- రైతులు సమన్వయంతో ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలి
- ఖేత్ బచావో అభియాన్‌లో ఆత్మ చైర్మన్ నల్ల సుధాకర్ రెడ్డి
- రైతులకు సబ్సిడీపై పెసర విత్తనాల పంపిణీ



డోర్నకల్ విశాలభారతి: ఎల్‌నినో ప్రభావంతో రానున్న రోజుల్లో నీటి ఎద్దడి, విద్యుత్ కోతలు ఎదురయ్యే అవకాశం ఉన్నందున రైతులు ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటూ ఆరుతడి పంటల సాగుకు ప్రాధాన్యం ఇవ్వాలని ఆత్మ చైర్మన్ నల్ల సుధాకర్ రెడ్డి సూచించారు. బుధవారం సీరోల్ మండలం చింతపల్లి గ్రామంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో మండల వ్యవసాయ అధికారి చాయరాజు నిర్వహించిన ఖేత్ బచావో అభియాన్ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రైతులు సమన్వయంతో పరిస్థితులను ఎదుర్కొంటూ పెసర, మినుము, వేరుశనగ, పొద్దుతిరుగుడు, కుసుమ వంటి ఆరుతడి పంటలతో పాటు జొన్న, సజ్జ, రాగులు సాగు చేయాలని సూచించారు.జిల్లా వ్యవసాయ అధికారి ఎస్. విజయ్ చంద్ర మాట్లాడుతూ భూసారాన్ని కాపాడుకోవడం ద్వారా ఎల్‌నినో వంటి ప్రకృతి వైపరీత్యాల ప్రభావాన్ని కొంతవరకు అధిగమించవచ్చన్నారు. సేంద్రియ ఎరువుల వినియోగం పెంచాలని, రసాయన ఎరువులను తగ్గించాలని, పురుగుమందులు, కలుపు మందులను సూచించిన మోతాదులోనే వాడాలని తెలిపారు. పొలాల్లో పంట కుంటలు నిర్మించుకోవడం, అవసరానికి అనుగుణంగా తడులు ఇవ్వడం, నానో యూరియా, డీఏపీ వినియోగం, పంట మార్పిడి, పప్పుదినుసుల సాగుతో భూసారాన్ని పరిరక్షించుకోవచ్చని వివరించారు. చింతపల్లి సర్పంచ్ భీరావత్ వీరన్న మాట్లాడుతూ రైతులు ఆచితూచి పంటల ఎంపిక చేసుకోవడం ద్వారా నష్టాలను నివారించవచ్చన్నారు. అనంతరం మిషన్ ఫర్ ఆత్మనిర్భర్ పల్సెస్ పథకం కింద రైతులకు సబ్సిడీపై పెసర విత్తనాలను పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో ఏఈ ఇరిగేషన్ జె. నిఖిలేందర్, ఏఈఓలు జి. సురేష్, ఎం. భరత్, ఎం. రమేష్, విద్యుత్ శాఖ లైన్‌మెన్, జీపీ, రెవెన్యూ, ఈజీఎస్, ఐకేపీ సిబ్బంది, పెద్ద సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి శ్రీకారం.. మంత్రులకు ఘన సన్మానం

- జల్‌పల్లిలో భూమిపూజ కార్యక్రమానికి హాజరైన నల్లెంకి ధన్‌రాజ్ గౌడ్ తదితర కాంగ్రెస్ నాయకులు



విశాల భారతి, ఎల్‌బీనగర్: మహేశ్వరం నియోజకవర్గం జల్‌పల్లి డివిజన్‌లో ఇందిరమ్మ డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల నిర్మాణ పనులకు భూమిపూజ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మహేశ్వరం నియోజకవర్గ ఇంచార్జ్ కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి, టీపీసీసీ సభ్యుడు దేప భాస్కర్ రెడ్డితో కలిసి డాక్టర్స్ కాలనీ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నల్లెంకి ధన్‌రాజ్ గౌడ్ కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం మంత్రులను మర్యాదపూర్వకంగా కలిసి శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రచార కమిటీ సభ్యుడు సామిడి గోపాల్ రెడ్డి, గడ్డిఅన్నారం మార్కెట్ డైరెక్టర్ బండి మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి మధుయాష్కి గౌడ్ పరామర్శ



విశాల భారతి, ఎల్‌బీనగర్ : గుండెపోటుతో మృతి చెందిన మన్సూరాబాద్‌కు చెందిన యువకుడు పోచబోయిన భవాని శంకర్ కుటుంబాన్ని ఆల్ ఇండియా ప్రొఫెషనల్స్ కాంగ్రెస్ చైర్మన్, మాజీ ఎంపీ మధుయాష్కి గౌడ్ పరామర్శించారు. దీపావళి పండుగ సందర్భంగా మన్సూరాబాద్ చౌరస్తాలో నిర్వహించిన సదర్ వేడుకల్లో పాల్గొన్న అనంతరం భవాని శంకర్ కుటుంబ సభ్యులను కలిసి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. చిన్న వయసులోనే గుండెపోటుతో భవాని శంకర్ మరణించడం బాధాకరమని మధుయాష్కి గౌడ్ ఆవేదన వ్యక్తం చేశారు. కుటుంబ సభ్యులను ఓదార్చి వారికి ధైర్యం చెప్పారు. ఈ కష్ట సమయంలో కుటుంబానికి తన సానుభూతి ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో యాదగిరిగుట్ట దేవస్థానం ట్రస్ట్ బోర్డు సభ్యురాలు పోచబోయిన ఈశ్వరమ్మ యాదవ్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ బుద్ద సత్యనారాయణ, డీసీసీ కార్యదర్శి కొప్పుల వెంకట్ రెడ్డి, చర్ల రమేష్, నాయకులు పోచబోయిన సురేష్ యాదవ్, రఘు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రమాద బాధితురాలిని పరామర్శించిన సీపీఐ నేత రవీంద్ర చారి



విశాల భారతి, అబ్దుల్లాపూర్ మెట్ : సీపీఐ పార్టీ సభ్యురాలు కొడపురం అరుణను సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఆందోజు రవీంద్ర చారి పరామర్శించారు. అక్టోబర్ 27 తేదిన జరిగిన రోడ్డు ప్రమాదంలో అరుణ గాయపడగా, ఆమెకు పక్కటెముక విరిగి బోన్ ఫ్రాక్చర్ అయినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. చికిత్స అనంతరం ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ అయి ఇంటికి చేరుకున్న ఆమెను రవీంద్ర చారి కలిసి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తూ, కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. పార్టీ సభ్యురాలి ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీసి, అవసరమైన సమయంలో అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

పించన్లతో పేదల ఇంట వెలుగులు

- అభివృద్ధితో షాద్‌నగర్‌కు కొత్త రూపు
- 750 మంది నిరుపేదలకు కొత్త పించన్లు మంజూరు
- నవంబర్ 19 నుంచి రూ.5 లక్షల ఇందిరమ్మ జీవిత బీమా
- రూ.100 కోట్లతో పట్టణ అభివృద్ధికి మాస్టర్ ప్లాన్
- షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

విశాల భారతి, షాద్‌నగర్:



ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నెరవేరుస్తున్నామని షాద్‌నగర్ ఎమ్మెల్యే, ప్రభుత్వ రంగ సంస్థల కమిటీ చైర్మన్ వీర్లపల్లి శంకర్ అన్నారు.గురువారం షాద్‌నగర్ మున్సిపల్ కార్యాలయంలో చైర్‌పర్సన్ అగ్గనూర్ బసవేశ్వర్ అధ్యక్షతన నిర్వహించిన చేయూత నూతన పించన్ల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నా రు. మున్సిపాలిటీ పరిధిలో అర్హులైన 750 మందికి కొత్త పించన్లు మంజూరు చేసి లబ్ధిదారులకు పించన్ మంజూరు పత్రాలు అందజేశారు. ఎన్నాళ్లుగానో ఎదురుచూస్తున్న పించన్లు మంజూరు కావడంతో నిరుపేద కుటుంబాల్లో ఆనందం వెల్లివిరిసింది.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత పదేళ్లుగా పించన్ల కోసం ఎదురుచూస్తున్న అర్హులకు ప్రజాపాలన ప్రభుత్వం అండగా నిలుస్తోందన్నారు. సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఇంటికి చేరాలన్న దే ప్రభుత్వ సంకల్పమని పేర్కొన్నారు.నవంబర్ 19 నుంచి తెల్ల రేషన్ కార్డు కలిగిన పేద కుటుంబాలకు రూ.5 లక్షల బీమా కల్పించే ఇందిరమ్మ జీవిత బీమా పథకాన్ని ప్రారంభించనున్నట్లు వెల్లడించారు.షాద్‌న గర్ పట్టణ అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళిక సిద్ధం చేస్తు న్నామని, రూ.50 నుంచి రూ.100 కోట్ల వ్యయంతో మాస్టర్ ప్లాన్ రూపొందించి పట్టణాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేస్తామని తెలిపారు. ఇప్పటికే చేపట్టిన సీసీ రోడ్లు, డ్రైనేజీ పనులతో పాటు రెండో విడత అభివృద్ధి పనులను త్వరలో ప్రారంభిస్తామన్నారు. రాజకీయాల కు అతీతంగా ప్రజాప్రతినిధులంతా పట్టణ అభివృద్ధికి సహకరించాలని కోరారు. అర్హులై ఉండి పించన్లు,రేష న్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు అందని వారు తన దృష్టికి తీసుకురావాలని సూచించారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సునీతారెడ్డి, చైర్‌పర్సన్ అగ్గనూ ర్ బసవేశ్వర్, వైస్ చైర్మన్ అందె మోహన్, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతిని ధులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

బోడుప్పల్‌లో దొంగతనం కేసును ఛేదించిన మేడిపల్లి పోలీసులు





మేడిపల్లి విశాల భారతి: బోడుప్పల్‌లోని ఎన్‌బీఆర్ కాలనీలో జరిగిన దొంగతనం కేసును మేడిపల్లి పోలీసులు ఛేదించారు. నిందితుడి వద్ద నుంచి 4.4 తులాల బంగారు ఆభరణాలు, 25 తులాల వెండి, మరియు ఒక సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఈ నెల 8వ తేదీన ఎన్‌బీఆర్ కాలనీలో నివాసముంటున్న రవీంద్ర చారి ఇంట్లో గుర్తుతెలియని వ్యక్తులు దొంగతనా నికి పాల్పడ్డారు. బాధితుడి ఫిర్యాదు మేరకు మేడిపల్లి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. సాంకేతిక ఆధారాలు మరియు సీసీటీవీ ఫుటేజీల సాయంతో నిందితుడిని పట్టుకుని, చోరీ సొత్తును రికవరీ చేశారు. నిందితుడి గత నేర చరిత్రను పరిశీలించగా. 2023 సంవత్సరంలో ఇల్లెందు పోలీస్ స్టేషన్ పరిధిలో కూడా ఇతనిపై ఒక కేసు నమోదు అయినట్లు గుర్తించారు. ఈ కేసును త్వరితగతిన ఛేదించి నిందితుడిని అరెస్టు చేయడంలో ప్రతిభ కనబరిచిన డీఎస్ఐ బోలిశెట్టి శ్రీను, హెచ్‌సీ రాము, పీసీలు మహిపాల్, హరిబా బులను మేడిపల్లి ఇన్‌స్పెక్టర్ జలంధర్ రెడ్డి. ప్రత్యేకంగా అభినందించారు.

భూగర్భ డ్రైనేజీ పనులు నాణ్యతతో పూర్తి చేయాలి



విశాల భారతి, ఎల్‌బీనగర్ : కాలనీల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధా న్యతనిస్తూ, ప్రజలకు శాశ్వత పరిష్కారం లభించేలా అభివృద్ధి పనులు చేపట్టాలని మాజీ కార్పొరేటర్ కల్లెం నవజీవన్ రెడ్డి సూచించారు. ఉమ్మడి హయత్‌నగర్ డివిజన్ పరిధిలో ఉండి, ప్రస్తుతం లెక్చరర్స్ కాలనీ డివిజన్ పరిధిలోకి వచ్చిన దత్తా త్రేయ కాలనీలో నూతనంగా చేపడుతున్న భూగర్భ డ్రైనేజీ నిర్మాణ పనులను ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా నిర్మాణ పనుల పురోగతిని పరిశీలించి, నాణ్యతా ప్రమాణాల కు అనుగుణంగా పనులు చేపట్టాలని సంబంధిత సిబ్బందికి సూచించారు. భవిష్యత్తులో డ్రైనేజీ సమస్యలు తలెత్తకుండా పటిష్టమైన వ్యవస్థను నిర్మించాలని, పనుల్లో నిర్లక్ష్యానికి తావులేకుండా నిర్దిష్ట సమయంలో పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని తెలిపారు. ప్రజల అవసరాలను గుర్తించి మౌలిక సదుపాయాల కల్పనకు నిరంతరం కృషి చేయాల్సిన బాధ్యత ప్రజాప్రతినిధులపై ఉందని ఈ సందర్భంగా పేర్కొన్నారు. ప్రజా సమస్యల పరిష్కారం, కాలనీల అభివృద్ధే లక్ష్యంగా ప్రజలకు అందుబాటులో ఉంటూ అభివృద్ధి పనులపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ అధ్యక్షుడు గంగాని శ్రీనివాస్, బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యుడు ఇట్టబోయిన నర్సింహా, కాలనీ అధ్యక్షుడు యాదగిరి యాదవ్, కాలనీ సంక్షేమ సంఘం సభ్యులు శ్రీనివాస్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.


ఆశావర్కర్ల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా

- రూ.18 వేల ఫిక్స్‌డ్ వేతనం, ఉద్యోగ భద్రత కల్పించాలని ఎమ్మెల్యేకు వినతి



విశాల భారతి, అబ్దుల్లాపూర్ మెట్ : ఆశావర్కర్లు ఎదుర్కొంటున్న సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి, పరిష్కారానికి కృషి చేస్తానని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి హామీ ఇచ్చారు. ఆశావర్కర్లు అందిస్తున్న సేవలను ప్రభుత్వం గుర్తిస్తోందని, వారి న్యాయమైన డిమాండ్ల పరిష్కారానికి ప్రభుత్వం సానుకూలంగా ఉందని తెలిపారు. గురువారం సీఐటీయూ ఆధ్వర్యంలో వివిధ గ్రామాలకు చెందిన ఆశావర్కర్లు ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డిని కలిసి తమ సమస్యలను వివరించారు. తమకు నెలకు రూ.18 వేల ఫిక్స్‌డ్ వేతనం చెల్లించాలని, పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యాలు కల్పించాలని, ఉద్యోగ భద్రతతో పాటు రిటైర్మెంట్ ప్రయోజనాలు కల్పించాలని కోరారు. అదేవిధంగా సెలవులు, ప్రమోషన్లు, కనీస వేతనం, డీఏ తదితర డిమాండ్లను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఆశా వర్కర్లు గ్రామీణ ప్రాంతాల్లో ప్రజారోగ్య పరిరక్షణకు అందిస్తున్న సేవలు కీలకమని పేర్కొన్నారు. ప్రజా ప్రభుత్వం అన్ని వర్గాల సంక్షేమానికి కట్టుబడి ఉందని, ఆశావర్కర్ల సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసు కెళ్లి పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకుడు నర్సింహతో పాటు వివిధ గ్రామాలకు చెందిన ఆశావర్కర్లు పాల్గొన్నారు.

సల్మాన్ ఖుర్షీద్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన జక్కిడి శివచరణ్ రెడ్డి



విశాల భారతి, ఎల్‌బీనగర్ : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మ కంగా నిర్వహిస్తున్న భారత్ సమ్మిట్ కార్యక్రమానికి హాజరైన కేంద్ర మాజీ మంత్రి, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు సల్మాన్ ఖుర్షీద్‌ను యువజన కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు జక్కిడి శివచరణ్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనతో సమావేశమై ఆత్మీయంగా మాట్లాడారు. ఈ కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పొన్నం తరుణ్ గౌడ్, యువజన కాంగ్రెస్ లీగల్ సెల్ చైర్మన్ గూడూరు నిఖిల్ రెడ్డి పాల్గొన్నారు.

20 ఏళ్ల రహదారి సమస్యకు పరిష్కారం

- పిగ్లిపూర్‌లో సీసీ రోడ్ల నిర్మాణం పూర్తి
- గ్రామాభివృద్ధే మా లక్ష్యం : సర్పంచ్ కోట ప్రభాకర్ రెడ్డి

విశాల భారతి, అబ్దుల్లాపూర్ మెట్ : గ్రామ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి, వాటి పరి ష్కారానికి ప్రాధాన్యతనిస్తూ పిగ్లిపూర్ గ్రామాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తున్నామని గ్రామ సర్పంచ్ కోట ప్రభాకర్ రెడ్డి తెలిపారు. గ్రామంలో జక్కుల యాదమ్మ ఇంటి నుంచి కోట సత్తిరెడ్డి భూమి వరకు, అలాగే మహిదిమియా ఇంటి వరకు సీసీ రోడ్ల నిర్మాణ పనులను పూర్తి చేసినట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా సర్పంచ్ కోట ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ.. గత 20 సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న రహదారి సమస్యకు పరిష్కారం చూపించడం సంతోషంగా ఉందన్నారు. గ్రామ ప్రజలు రాకపోకల్లో ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని సీసీ రోడ్ల నిర్మాణానికి చర్యలు చేపట్టినట్లు తెలిపారు. సర్పంచ్‌గా బాధ్యతలు స్వీకరించిన నాటి నుంచి గ్రామ అభివృద్ధే ప్రధాన లక్ష్యంగా పనిచేస్తున్నామని పే ర్కొన్నారు. మాటలకే పరిమితం కాకుండా అభివృద్ధిని చేతల్లో చూపించాలన్నదే తమ సంకల్పమని, ప్రతి వీధికి మెరుగైన రహదారులు, ప్రతి కుటుంబానికి అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించేందుకు కృషి చేస్తామని స్పష్టం చేశారు. గ్రామ ప్రజల సహకారంతో పిగ్లిపూర్‌ను మరింత అభివృద్ధి చేస్తామని కోట ప్రభాకర్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి జోష్నా ఉపసర్పంచ్ దుర్గం నర్సింహా యాదవ్ , వార్డు సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



భాగ్యలక్ష్మి అమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే మల్‌రెడ్డి

- దీపావళి సందర్భంగా ప్రత్యేక పూజల్లో పాల్గొన్న ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే

విశాల భారతి, ఇబ్రహీంపట్నం / అబ్దుల్లాపూర్ మెట్ : దీపావళి పర్వదినాన్ని పురస్కరించుకుని చా ర్మినార్‌లోని శ్రీ భాగ్యలక్ష్మి అమ్మవారి ఆలయంలో నిర్వహించిన ప్రత్యేక పూజల్లో ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి పాల్గొన్నారు. ఆలయ కమిటీ ఆహ్వానం మేరకు గురువారం సాయంత్రం ఆలయానికి చేరుకున్న ఎమ్మెల్యేకు ఆలయ ధర్మకర్త ఘనస్వాగతం పలికారు. అనంతరం భాగ్యలక్ష్మి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వ హించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి మాట్లాడుతూ.. ప్రజలందరూ సుఖశాం



తులతో, ఆయురారోగ్యాలతో, సిరిసంపదలతో వర్ధిల్లాలని అమ్మవారిని ప్రార్థించినట్లు తెలిపారు. దీపావళి పండుగ ప్రతి ఒక్కరి జీవితాల్లో వెలుగులు నింపాలని ఆకాంక్షించారు.

పేద ప్రజలకు కాంగ్రెస్ అండగా ఉంటుంది



- రత్నావత్ శివ నాయక్ నిమ్స్ ఆస్పత్రిలో వైద్యం
- ఎమ్మెల్యే సహకారంతో 7 లక్షల రూపాయల ఎల్ఓసి అందజేత
- మంచాల మండల సహకార
- బ్యాంకు డైరెక్టర్ జనగే వెంకటేష్ యాదవ్

విశాల భారతి ఇబ్రహీంపట్నం:


పేద ప్రజలకు కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడు అండగా ఉంటుందని మంచాల మండల సహకార బ్యాంకు డైరెక్టర్ జనగా వెంకటేష్ యాదవ్ అన్నారు. మంచాల మండల పరిధిలోని చెన్న రెడ్డి గూడ గ్రామానికి చెందిన రత్నా వత్ శివ నాయక్ గత కొద్ది రోజుల క్రితం రోడ్డు ప్రమాదంలో గాయపడి తలకు పెద్దగాయం కావడంతో వైద్యం నిమిత్తం నగరంలోని నిమ్స్ ఆసుపత్రిలో చేర్పించారు. డాక్టర్లు శివకు హెడ్ ఆపరేషన్ చేయాలని,లక్షలు ఖర్చు అవుతుందని డాక్టర్లు చెప్పడంతో ఆందోళన చెందిన శివ కుటుంబ సభ్యులు స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకుడు మంచాల సహకార సంఘం డైరెక్టర్ జెనిగే వెంకటేష్ యాదవ్ దృష్టికి తీసుకురావడంతో శివ కుటుంబ సభ్యులను వెంటబెట్టుకొని ఇబ్రహీం పట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డిని కలిసి శివకు జరిగిన రోడ్డు ప్రమాదం గురించి వివరించారు. వెంటనే స్పందించిన ఎమ్మెల్యే రత్నావత్ శివ వైద్యం కోసం ఏడు లక్షల రూపాయల ఎల్ఓసి మంజూరు చేశారు. వెంటనే మంచాల సహకార సంఘం డైరె క్టర్ జెనిగే వెంకటేష్ యాదవ్ స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి నిమ్స్ ఆసుపత్రికి చేరుకొని శివ నాయక్ కుటుంబ సభ్యులకు 7 లక్షల రూపాయల ఎల్ఓసి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా జెనిగే వెంకటేష్ యాదవ్ మాట్లాడుతూ పేద ప్రజ లకు కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ఎల్లప్పుడు అండగా ఉంటుందని ఆరోగ్యం వికటించి ఆసుపత్రిలో వైద్యం చేయించుకోలేని స్థితిలో ఉన్న పేద ప్రజలకు ఎల్ వో సి నుండి మంజూరయ్యే డబ్బులు వరం లాంటివని అన్నారు. వైద్యం చేయించుకోలేని స్థితిలో ఉన్న పేద ప్రజలు ఎవ్వరు అధైర్య పడవద్దని అన్నారు. ఇబ్ర హీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి సహకారం పేద ప్రజలకు ఎల్లప్పుడూ ఉంటుందని కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో చెన్నారెడ్డి గూడా గ్రామ మాజీ సర్పంచ్ ఆంబోతు కిషన్ నాయక్, వార్డు సభ్యుడు హర్య రత్నావత్ స్వామి బాణావత్ శ్రీనివాస్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ ఫలాలు

- గ్రామాల అభివృద్ధికి పెద్దపీట
- నాలుగు గ్రామాల్లో అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే శంకర్ శ్రీకారం
- రేషన్ షాపుల ప్రారంభం
- 131 మందికి స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ

విశాల భారతి,షాద్ నగర్:


గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి,అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాల ఫలాలు అందించడమే లక్ష్యంగా ముందుకు సాగు తున్నామని షాద్‌నగర్ ఎమ్మెల్యే, ప్రభుత్వ రంగ సంస్థల కమిటీ చైర్మన్ వీర్లపల్లి శంకర్ అన్నారు. కేశంపేట్ మండలంలోని దేవుని గుడి తండా, రాగ్యతండా, చింతకుంటపల్లి ,పాటిగడ్డ గ్రామాల్లో గురువారం ఆయన పర్యటించి పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించడంతో పాటు కొత్త పనులకు శంకుస్థాపనలు చేశారు. దే వునిగుడి తండా, చిం తకుంటపల్లి,పాటిగడ్డ గ్రామాల్లో నూతన రేషన్ దుకాణాలను ప్రారంభించి మొత్తం 131 మంది లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేశారు. దేవునిగుడి తండా, రాగ్యతండా,పాటిగడ్డ గ్రామా ల్లో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనులకు శంకుస్థాపన చేశారు. చింతకుంటపల్లిలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధి దారుల గృహప్రవేశ కార్యక్రమంలో పాల్గొన్నారు. రాగ్యతండాలో తాగునీటి సమస్య పరిష్కారానికి పైప్‌లైన్, గేట్‌వాల్ మంజూరుకు కృషి చేస్తానని, మహిళా సంఘాలకు అవసరమైన వసతులు కల్పి స్తానని హామీ ఇచ్చారు. చింతకుంటపల్లిలో ఎస్సీ కమ్యూనిటీ హాల్ మంజూరుకు కృషి చేయడంతో పాటు మహిళా సంఘ భవన నిర్మాణం పూర్తి చేసేందుకు నిధులు సమకూరుస్తామని తెలిపారు. మహిళా సంఘాల బలోపేతానికి ప్రభుత్వం ప్రా ధాన్యత ఇస్తోందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాల్లో తాగునీరు, పారి శుద్ధ్యం, డ్రైనేజీ వంటి మౌలిక సదుపాయాల కల్ప నకు ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. సంక్షేమ పథకాలు కేవలం ప్రకటనలకే పరిమితం కాకుండా



అర్హులైన ప్రతి కుటుంబానికి చేరాలన్నదే ప్రభుత్వ సంకల్పమని స్పష్టం చేశారు. గ్రామాల అవసరాలను గుర్తించి దశలవారీగా అభివృద్ధి పనులు చేపడతా మని అన్నారు.ఈ కార్యక్రమంలో కొత్తపేట సింగిల్ విండో చైర్మన్ యెన్నం శ్రీధర్ రెడ్డి, మాజీ జెడ్పీటీసీ తాండ్ర విశాల శ్రావణ్ రెడ్డి, ఎంపీడీవో రవిచంద్ర రెడ్డి, తహశీల్దార్ రాజేందర్ రెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు రమేష్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు జగదీశ్వ ర్ అప్పా, కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, వివిధ గ్రామాల సర్పంచులు, అధికారులు, మహిళా సంఘాల సభ్యులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బొమ్మల విక్రయానికి వెళ్లి వ్యక్తి అదృశ్యం

- 60 ఏళ్ల పెరుమాళ్ ఆచూకీ కోసం నాగోల్ పోలీసుల గాలింపు



విశాల భారతి, ఎల్‌బీనగర్ : బొమ్మలు విక్రయించేందుకు ఇంటి నుంచి బయటకు వెళ్లిన 60 ఏళ్ల వ్యక్తి అదృశ్యమైన ఘటన నాగోల్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. నాగోల్ ఇన్‌స్పె క్టర్ మొహమ్మద్ మక్బూల్ జానీ తెలిపిన వివరాల ప్రకారం.. జైపురి కాలనీ, రోడ్ నంబర్ 2, ఆర్‌సీఆర్ రేషన్ షాప్ సమీపంలో నివాసముంటున్న సుందరరాజ్ పాండియన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆయన సోదరుడు పెరుమాళ్ (60) అదృశ్యమైనట్లు పోలీసులు కేసు నమోదు చేశారు. పెరుమాళ్ తన తమ్ముడితో కలిసి నివసిస్తూ, అలంకరణ బొమ్మలను వీధివీధికి తిరుగుతూ విక్రయించి జీవనం సాగించేవాడు. ఆయనకు వివాహం కాలేదని, కుటుంబం లేదని, సాధారణ విషయాలపై పూర్తి అవగాహన ఉండదని ఫిర్యాదుదారుడు పోలీసులకు వివరించారు. ఈ క్రమంలో గత అక్టోబర్ 5వ తేదీ ఉదయం సుమారు 8 గంటలకు బొమ్మలు అమ్మడానికి వెళ్తున్నానని చెప్పి ఇంటి నుంచి బయటకు వెళ్లిన పెరుమాళ్ తిరిగి రాలేదు. గతంలో కూడా ఇదే విధంగా రెండుసార్లు ఇంటి నుంచి వెళ్లి 10 నుంచి 15 రోజుల తర్వాత తిరిగి వచ్చేవాడని, ఈసారి కూడా వస్తాడని కుటుంబ సభ్యులు భావించి కొంతకాలం వేచి చూశారు. అయి నప్పటికీ ఆచూకీ లభించకపోవడంతో తెలిసిన ప్రాంతాలు, ఇతర ప్రదేశాల్లో గాలించారు. పెరుమాళ్ వద్ద మొబైల్ ఫోన్ కూడా లేదని ఫిర్యాదుదారుడు తెలిపారు. ఫిర్యాదు మేరకు నాగోల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని అదృశ్యమైన వ్యక్తి ఆచూకీ కోసం గాలింపు చర్యలు చేపట్టారు.

తల్లి, కుమార్తె అదృశ్యం

- భర్త ఫిర్యాదుతో కేసు నమోదు.. ఆచూకీ కోసం నాగోల్ పోలీసుల గాలింపు



విశాల భారతి, ఎల్‌బీనగర్: నాగోల్ పోలీస్ స్టేషన్ పరిధిలో తల్లి, ఏడేళ్ల కుమార్తె అదృశ్యమైన ఘటనపై కేసు నమోదైంది. నాగోల్ ఇన్‌స్పెక్టర్ మొహమ్మద్ మక్బూల్ జానీ తెలిపిన వివరాల ప్రకారం.. జైపురి కాలనీ, రోడ్ నంబర్ 1, శ్రీ వెంకటేశ్వర వైన్స్ ఎదురుగా ని వాసముంటున్న సంపంగి సురేష్ (39) ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ నెల 6వ తేదీ ఉదయం సుమారు 8:30 గంటలకు తన భార్య సంపంగి సుగుణ (35), కుమార్తె సంపంగి నందిని (7)తో కలిసి తాను పనిచేసే ఇళ్లలో జీతం తీసుకొని వస్తానని చెప్పి ఇంటి నుంచి వెళ్లినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. అయితే ఎంతసేపటికీ తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు బంధువుల ఇళ్లతో పాటు పలు ప్రాంతాల్లో వెతికినా వారి ఆచూకీ లభించలేదు. దీంతో సంపంగి సురేష్ పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేయగా, నాగోల్ పోలీసులు కేసు నమోదు చేసుకొని అదృశ్యమైన తల్లి, కుమార్తె ఆచూకీ కోసం గాలింపు చర్యలు చేపట్టారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి శంకుస్థాపన

- మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి

రాజేంద్రనగర్, విశాలభారతి : రాజేంద్రనగర్ నియోజకవర్గం మైలార్‌దేవ్‌పల్లిలో పేదల సొంతింటి కలను సాకారం చేసే దిశగా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్ర మానికి రాష్ట్ర మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్ బాబు ముఖ్య అతిథులుగా హాజరుకాగా, స్థానిక ఎమ్మెల్యే టి. ప్రకాష్ గౌడ్ విశిష్ట అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రులు పొంగులేటి శ్రీని వాస్ రెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్ బాబు, ఎమ్మెల్యే టి. ప్రకాష్ గౌడ్ కలిసి ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు శంకుస్థాపన చేశారు. అనంతరం ప్రభుత్వం ఎంపిక చేసిన అర్హులైన నిరుపేద లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలను అందజేశారు. దీంతో లబ్ధిదారుల్లో ఆనందం వెల్లివిరిసింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే టి. ప్రకాష్ గౌడ్ మాట్లాడుతూ పేదల సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా ప్రజా ప్రభుత్వం పనిచేస్తోందని పేర్కొన్నారు. అర్హులైన ప్రతి నిరుపేద కుటుంబానికి సొంతింటి కల నెరవేర్చేందుకు ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తోందన్నారు. ఇళ్ల నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేసుకుని లబ్ధిదారులు త్వరలోనే తమ సొంతింటిలో గృహప్రవేశం చేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజా ప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

గొల్లూరు ఎక్స్‌రోడ్ వద్ద ఘోర రోడ్డు ప్రమాదం

- ఇన్నోవాపై బోల్తాపడిన బొలెరో
- అదృష్టవశాత్తూ కారులో ప్రయాణిస్తున్న నలుగురికి తప్పిన ప్రమాదం



రాజేంద్రనగర్, విశాలభారతి : గొల్లూరు ఎక్స్‌రో డ్ సమీపంలోని పి1 రహదారిపై గురువారం తెల్ల వారుజామున రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. వేగంగా వచ్చిన మహీంద్రా బొలెరో వాహనం ఇన్నోవా కారును వెనుక నుంచి ఢీకొట్టడంతో కారు పూర్తిగా ధ్వంసమైంది. అయితే కారులో ప్రయాణిస్తు న్న నలుగురికి ఎలాంటి గాయాలు కాకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్‌లోని బోరబండకు చెందిన మతంశెట్టి శ్రీనివాసరావు (56) డ్రైవర్‌గా పనిచేస్తున్నారు. ఈ క్రమంలో తన యజమాని కోట మధుసూదన్, ఆయన కుమారుడు శ్రీకర్ బాబు, శేఖర్ మాస్టర్‌తో కలిసి గొల్లూరు గ్రామ పరిధిలో జరిగిన ఓ కార్యక్రమానికి హాజరయ్యారు. కార్యక్రమం ముగిసిన అనంతరం గురువారం ఉదయం 5.20 గంటలకు ఇన్నోవా కారు (టీఎస్ 09 ఎఫ్‌జీ 3348)లో హైదరాబా ద్‌లోని బంజారాహిల్స్‌కు బయలుదేరారు. ఈ క్రమంలో ఉదయం 5.40 గంటల సమయంలో గొల్లూరు ఎక్స్‌రోడ్ వద్ద సంగిగూడ వైపు వెళ్లేందుకు పి1 రహదారిపై కారు కుడివైపునకు మలుపు తీసుకుంటుండగా, పాలమాకుల వైపు నుంచి సంగిగూడ వైపు వెళ్తున్న మహీంద్రా బొలెరో ట్రక్ (కేఏ 28 ఏసీ 3263) వేగంగా, అజాగ్రత్తగా వచ్చి ఇన్నోవా కారును వెనుక నుంచి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బొలెరో వాహనం ఇన్నోవా పై బోల్తాపడటంతో కారు పూర్తిగా దెబ్బతిన్నది. ప్రమాదానికి కారణమైన బొలెరో డ్రైవర్ కర్ణాటక రాష్ట్రం బీజాపూర్ జిల్లాకు చెందిన మల్లయ్య హిరేమఠ్‌గా గుర్తించారు.

అయ్యప్ప స్వామి దీక్ష ఎంతో పవిత్రమైనది

- అన్నదానం మహాదానం
- పాల్వంచ అయ్యప్ప స్వామి దేవస్థానం కమిటీ

పాల్వంచ విశాలభారతి:

అయ్యప్ప స్వామి దీక్ష అత్యంత పవిత్రమైనదని, దీక్షా కాలంలో భక్తిశ్రద్ధలతో నియమ నిష్ఠలు పాటిస్తూ స్వామివారిని ఆరాధించడం ఆధ్యాత్మిక జీవితానికి ఎంతో ప్రాముఖ్యతను ఇస్తుందని పాల్వంచ అయ్యప్ప స్వామి దేవస్థానం కమిటీ సభ్యులు పేర్కొన్నారు. అన్నదానం మహాదానమనే సంకల్పంతో పాల్వంచలోని అయ్యప్ప స్వామి దేవస్థానంలో ప్రతి సంవత్సరం నిర్వహిస్తున్న మహా అన్నదాన కార్యక్రమం భక్తులకు విశేష సేవగా నిలుస్తోంది. పాల్వంచలో కొలువై ఉన్న శ్రీ అయ్యప్ప స్వామి దేవస్థానంలో అయ్యప్ప దీక్ష చేపట్టిన స్వాముల కోసం ప్రతి సంవత్సరం నవంబర్ 1వ తేదీ నుంచి జనవరి 5వ తేదీ వరకు మహా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. గత 20 సంవత్సరాలుగా ఎలాంటి అంతరాయం లేకుండా ఈ అన్నదాన కార్యక్రమాన్ని కొనసాగిస్తూ భక్తులకు అన్నప్రసాదాన్ని అందించడం విశేషం. దీక్షా కాలంలో వివిధ ప్రాంతాల నుంచి దేవస్థానానికి విచ్చేసే అయ్యప్ప స్వాములకు ప్రతిరోజూ భక్తితో అన్నప్రసాదాన్ని వడ్డిస్తున్నారు. ఈ మహా అన్నదాన కార్యక్రమం ద్వారా రోజుకు సుమారు 500 నుంచి 700 మంది వరకు అయ్యప్ప దీక్ష స్వాములు అన్నప్రసాదాన్ని స్వీకరిస్తున్నారు. దీక్షా సమయంలో స్వాములు ఒకచోట చేరి భక్తిశ్రద్ధలతో స్వామివారిని దర్శించుకోవడంతో పాటు అన్నప్రసాదాన్ని స్వీకరించడం దేవస్థానంలో ఆధ్యాత్మిక వాతావరణాన్ని మరింత పెంపొందిస్తోంది.



భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా దేవస్థానం కమిటీ సభ్యులు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నారు. అన్నదానం కేవలం ఆకలి తీర్చే కార్యక్రమం మాత్రమే కాకుండా సేవాభావం, సమానత్వం, మానవత్వానికి ప్రతీకగా నిలుస్తుందని, భగవంతుని సేవలో భాగంగా అన్నప్రసాద వితరణ చేయడం ఎంతో పుణ్యప్రదమైన కార్యమని భక్తులు అభిప్రాయపడుతున్నారు. రెండు దశాబ్దాలుగా ఈ సేవా కార్యక్రమాన్ని కొనసాగించడం దేవస్థానం కమిటీ అంకితభావానికి నిదర్శనంగా నిలుస్తోంది. ప్రతి సంవత్సరం అయ్యప్ప దీక్షా కాలంలో ఈ కార్యక్రమం కోసం భక్తులు, దాతలు తమవంతు సహకారం అందించడం విశేషం. ఈ సందర్భంగా దేవస్థాన ప్రధాన పూజారి మాధవన్ నంబూద్రి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. స్వామివారికి ప్రత్యేక పూజలు, ప్రార్థనలు నిర్వహించి భక్తులందరికీ స్వామివారి ఆశీస్సులు కలగాలని ఆకాంక్షించారు. అనంతరం గురుస్వాములను శాలువాలతో ఘనంగా సన్మానించారు. గురుస్వాములు అయ్యప్ప దీక్షా నియమాలు, ఆధ్యాత్మిక క్రమశిక్షణను పాటిస్తూ భక్తులకు మార్గదర్శకులుగా నిలుస్తున్నారని ఈ సందర్భంగా కొనియాడారు. పాల్వంచ అయ్యప్ప స్వామి దేవస్థానంలో కొనసాగుతున్న ఈ మహా అన్నదాన కార్యక్రమం భక్తుల మధ్య ఐక్యతను, సేవాభావాన్ని పెంపొందిస్తూ ఆధ్యాత్మిక సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తోంది. భవిష్యత్తులో నూ ఇదే స్ఫూర్తితో అన్నదాన కార్యక్రమాన్ని మరింత విస్తృతంగా కొనసాగించేందుకు దేవస్థానం కమిటీ కృషి చేస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం ట్రస్ట్ సభ్యులు, గురుస్వాములు, మాలధారణ చేసిన అయ్యప్ప స్వాములు, భక్తులు పాల్గొన్నారు.

విద్యార్థులకు సౌకర్యాలు.. స్థానికులకు ఇబ్బందులు లేకుండా నిర్మాణాలు

- హయత్‌నగర్ జెడ్పీ ఉన్నత పాఠశాలలో నూతన మూత్రశాలల పనులను పరిశీలించిన ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి



విశాల భారతి, ఎల్‌బీనగర్ : విద్యార్థులకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించడంతో పాటు పరిసర ప్రాంత ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నిర్మాణ పనులు చేపట్టాలని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి సూచించారు. హయత్‌నగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థుల సౌకర్యార్థం నూతనంగా నిర్మిస్తున్న మూత్రశాలల పనులను స్థానిక మాజీ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డితో కలిసి ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా నిర్మాణ పనుల పురోగతిని, నాణ్యతా ప్రమాణాలను పరిశీలించి సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు. పాఠశాల ప్రహరీ గోడకు లోపలి వైపు, పరిసర బస్తీల నివాసాలకు తగినంత దూరంలో మూత్రశాలలను నిర్మించాలని సూచించారు. నిర్మాణం పూర్తయిన తర్వాత దుర్వాసన వ్యాపించకుండా, స్థానిక నివాసితులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. అదేవిధంగా సరైన డ్రైనేజీ వ్యవస్థ, గాలి ప్రసరణ, పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని, విద్యార్థులకు ఆరోగ్యకరమైన వాతావరణం కల్పించేలా నిర్మాణ పనులు నాణ్యతతో పూర్తి చేయాలని అధికారులకు స్పష్టం చేశారు. విద్యార్థుల సౌకర్యాలతో పాటు పరిసర ప్రాంత ప్రజల ఆరోగ్యం, ఇబ్బందులను కూడా దృష్టిలో ఉంచుకుని పనులు చేపట్టాలని ఎమ్మెల్యే సూచించారు. ఈ కార్యక్రమంలో హయత్‌నగర్ డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు చెన్నగౌని శ్రీధర్ గౌడ్, బీజేపీ అధ్యక్షుడు గంగాని శ్రీనివాస్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు భాస్కర్ సాగర్, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

అయ్యవారిపల్లి వాగుపై బ్రిడ్జి నిర్మాణానికి కదలిక

- ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ చొరవతో త్వరలో పనుల ప్రారంభం
- పెండింగ్ బిల్లులు చెల్లించే బాధ్యత నాది.. కాంట్రాక్టర్లకు ఎమ్మెల్యే హామీ



విశాల భారతి, షాద్‌నగర్: ఎన్నో రోజులుగా పెండింగ్‌లో ఉన్న అయ్యవారిపల్లి వాగు బ్రిడ్జి నిర్మాణ పనులకు ఎట్టకేలకు కదలిక వచ్చింది. ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ప్రత్యేక చొరవతో త్వరలోనే పనులు తిరిగి ప్రారంభం కానున్నాయి. ఈ మేరకు గురువారం షాద్‌నగర్‌లోని తన క్యాంపు కార్యాలయంలో సంబంధిత శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించిన ఎమ్మెల్యే, ఉన్నతాధికారులతో ఫోన్‌లో మాట్లాడి పనుల పురోగతిపై ఆరా తీశారు.అర్ధాంతరంగా నిలిచిపోయిన బ్రిడ్జి నిర్మాణ పనులను వెంటనే ప్రారంభించాలని కాంట్రాక్టర్లకు సూచించారు. బిల్లులు పెండింగ్‌లో ఉంటే ప్రభుత్వంతో మాట్లాడి వాటిని చెల్లించేలా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. బ్రిడ్జి నిర్మాణం పూర్తయితే అయ్యవారిపల్లి, ఉప్పరిగడ్డతో పాటు పరిసర గ్రామాల ప్రజలకు రాకపోకలు సులభతరం కానున్నాయని పేర్కొన్నారు. పనుల జాప్యానికి గత పాలకుల నిర్లక్ష్యమే కారణమని విమర్శించారు. త్వరలోనే ఈ సమస్యను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి పనులు వేగవంతమయ్యేలా చూస్తానని తెలిపారు.

ఎమ్మెల్యేకు సర్పంచ్ కృతజ్ఞతలు

అయ్యవారిపల్లి బ్రిడ్జి నిర్మాణ పనుల పునఃప్రారంభానికి చొరవ చూపుతున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌కు ఉప్పరిగడ్డ సర్పంచ్ చందు నాయక్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఎమ్మెల్యే నాయకత్వంలోనే బ్రిడ్జి నిర్మాణం పూర్తవుతుందనే ఆశాభావం వ్యక్తం చేశారు. గ్రామాల ప్రజల సమస్యల పరిష్కారానికి ఎమ్మెల్యే చేస్తున్న కృషిని అభినందిస్తూ ఉప్పరిగడ్డ ప్రజల తరఫున ధన్యవాదాలు తెలిపారు.

డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పేరుతో డబ్బుల వసూళ్లు..
దళారిపై కేసు నమోదు చేయాలి






- ఒక్కొక్కరి నుంచి రూ.3 లక్షలు వసూలు చేస్తున్నట్లు ఆరోపణలు
- మంత్రి శ్రీధర్‌బాబు, మాజీ ఎంపీ మధుయాష్కికి బాధితుల ఫిర్యాదు

విశాల భారతి, ఎల్‌బీనగర్ : డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు ఇప్పిస్తామంటూ పేద ప్రజల నుంచి డబ్బులు వసూలు చేస్తున్న వ్యక్తిపై కేసు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని బీసీ పీపుల్స్ ఫెడరేషన్ వ్యవస్థాపకుడు బొంగు వెంకటేశ్ గౌడ్ డిమాండ్ చేశారు. మన్సూరాబాద్ డివిజన్ పరిధిలోని ఎరుకల నాంచారమ్మ ఏకలవ్య నగర్ కాలనీలో డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు ఇప్పిస్తామని పలువురి నుంచి డబ్బులు వసూలు చేస్తున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తాయి. ఈ విషయంపై భారత ఎరుకల కుల వృత్తుల అభివృద్ధి సేవా సంఘం హైదరాబాద్ జిల్లా కార్యదర్శి వసం గంగయ్య, వైస్ ప్రెసిడెంట్ దాసరి గంగాధర్, బాధితులు గురువారం మన్సూరాబాద్ డివిజన్ సౌత్ ఎండ్ పార్కుకు వచ్చిన మంత్రి శ్రీధర్‌బాబు, మాజీ ఎంపీ మధుయాష్కీ గౌడ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కాలనీలోని డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు ఇప్పిస్తానంటూ స్థానికంగా ఉంటున్న సాగర్ గంగయ్య అనే వ్యక్తి పలువురు పేద ప్రజలను నమ్మించి డబ్బులు వసూలు చేస్తున్నట్లు ఆరోపించారు. తనకు రాజకీయ పలుకుబడి ఉందని, అధికారులు తనకు సహకరిస్తున్నారని నమ్మబలుకుతూ ఒక్కొక్కరి నుంచి సుమారు రూ.3 లక్షల వరకు వసూలు చేస్తున్నట్లు బాధితులు ఫిర్యాదు చేశారు. ఇళ్ల కోసం ఆశపడి అప్పులు చేసి డబ్బులు చెల్లించిన పేదలకు న్యాయం చేయాలని, డబ్బులు వసూలు చేసిన వ్యక్తిపై విచారణ జరిపి కేసు నమోదు చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో బాధితులు దాసరి మమత, భిక్షమ్మ, ఎరుకల నాంచారమ్మ బస్తీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలి

- కమిటీ ఎన్నిక పూర్తిచేసి పార్టీ బలోపేతానికి సమష్టిగా పనిచేయాలి
- దాద్‌పల్లిలో కాంగ్రెస్ కార్యకర్తల సమావేశంలో మల్‌రెడ్డి అభిషేక్‌రెడ్డి
- ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి గ్రామంలో స్మార్ట్ రేషన్‌కార్డుల పంపణీ



విశాల భారతి ఇబ్రహీంపట్నం : పేద ప్రజల సంక్షేమమే లక్ష్యంగా రేవంత్‌రెడ్డి ప్రభుత్వం విప్లవాత్మక పథకాలను అమలుచేస్తోందని,వాటిని పేదల దరిచేర్చేందుకు కాంగ్రెస్ కార్యకర్తలు ముందుండి పనిచేయాలని పార్టీ రాష్ట్ర నాయకుడు మల్‌రెడ్డి అభిషేక్‌రెడ్డి సూచించారు. మంగళవారం మంచాల మండలం దాద్‌పల్లి గ్రామంలో పర్యటించిన ఆయన కాంగ్రెస్ కార్యకర్తలతో సమావేశమయ్యారు.గ్రామశాఖ అధ్యక్షుడి ఎన్నికపై చర్చించిన అభిషేక్ వీలైనంత త్వరగా ప్రక్రియ పూర్తిచేయాలని చెప్పారు. సమష్టిగా పనిచేస్తూ ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి చేస్తున్న గ్రామాల అభివృద్ధిలో ప్రతీఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. గ్రామసర్పంచ్, అధికారులతో కలిసి స్మార్ట్‌రేషన్‌కార్డుల పంపిణీ. ప్రజాపంపిణీ వ్యవస్థ సంస్కరణల్లో భాగంగా రాష్ట్రప్రభుత్వం తెచ్చిన స్మార్ట్‌రేషన్‌కార్డులను దాద్‌పల్లి గ్రామంలో సర్పంచ్ శాంతీరాజు, వార్డు సభ్యులు, అధికారులతో కలిసి అభిషేక్ పంపిణీ చేశారు.సివిల్ సప్లైలో మరింత పారదర్శకతకు ఈ కార్డులు దోహదపడతాయని ఆయన తెలిపారు.ఈ సమావేశంలో మండల పార్టీ అధ్యక్షులు నరేందర్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

హేమంగ్ జోషికి తెలంగాణలో ఘన స్వాగతం



రాజేంద్రనగర్, విశాల భారతి : భారతీయ జనతా యువ మోర్చా (బీజేవైఎం) జాతీయ అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం తొలిసారిగా తెలంగాణ రాష్ట్ర పర్యటనకు విచ్చేసిన హేమంగ్ జోషికి బీజేపీ, బీజేవైఎం నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయానికి చేరుకున్న ఆయనకు బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షుడు కుండే గణేష్ ఆధ్వర్యంలో రాష్ట్ర, జిల్లా, మండల స్థాయి నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి ఘనంగా స్వాగతం పలికారు. పుష్పగుచ్ఛాలు అందజేసి, నినాదాలతో తమ అభిమానాన్ని చాటుకున్నారు. అనంతరం హేమంగ్ జోషి రంగారెడ్డి జిల్లా యువమోర్చా అధ్యక్షుడు బుర్ర అభినయ గౌడ్ నివాసానికి విందు కార్యక్రమానికి విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయనకు బుర్ర అభినయ గౌడ్ కుటుంబ సభ్యులు, పార్టీ నాయకులు ఆత్మీయ స్వాగతం పలికారు. అనంతరం నిర్వహించిన విందు కార్యక్రమంలో పాల్గొన్న హేమంగ్ జోషి పార్టీ నాయకులు, యువమోర్చా కార్యకర్తలతో కొద్దిసేపు ఆత్మీయంగా ముచ్చటించారు. ఈ సందర్భంగా యువమోర్చా నాయకులు రాష్ట్రంలో పార్టీ కార్యక్రమాలు, యువతను రాజకీయాల్లో భాగస్వాములను చేయడం, క్షేత్రస్థాయిలో యువమోర్చాను మరింత బలోపేతం చేయడం వంటి అంశాలపై తమ అభిప్రాయాలను పంచుకున్నారు. యువతలో నాయకత్వ లక్షణాలను పెంపొందిస్తూ, ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటం చేయాలని, పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు కార్యకర్తలు సమష్టిగా కృషి చేయాలని నాయకులు పేర్కొన్నారు. జాతీయ అధ్యక్షుడి హోదాలో హేమంగ్ జోషి తొలిసారిగా తెలంగాణకు రావడం రాష్ట్ర యువమోర్చా శ్రేణుల్లో నూతన ఉత్సాహాన్ని నింపింది. ఆయన పర్యటనను పురస్కరించుకుని రాష్ట్రవ్యాప్తంగా యువమోర్చా నాయకులు, కార్యకర్తలు ఉత్సాహంగా పాల్గొనడం విశేషం. ఈ కార్యక్రమంలో బీజేపీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు పంతంగి రాజ్ భూపాల్ గౌడ్, బుర్ర మహేలింగం గౌడ్, మహేందర్, మల్లారెడ్డి, మల్లేష్‌యాదవ్, వంశీ యాదవ్, గోవర్ధన్ రెడ్డితో పాటు రాష్ట్ర, జిల్లా యువమోర్చా నాయకులు, మండల స్థాయి నాయకులు, పలువురు బీజేపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

సాంకేతిక పరిజ్ఞానాలపై రైతులకు అవగాహన

- రైతులు భూసార పరిరక్షణ పరీక్షలు. నేల ఆరోగ్య సంరక్షణ పద్ధతులు పాటించాలి.

విశాల భారతి ఇబ్రహీంపట్నం


కృషివిజ్ఞానకేంద్రం రంగారెడ్డి, ఐసీఏఆర్- క్రీడ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయశాఖ సంయుక్త ఆధ్వర్యంలో రంగారెడ్డిజిల్లా, యాచారం మండలంలోని మంతంగౌడ్ గ్రామంలో కేత్ బచావ్ అభియాన్ అవగాహన కార్యక్రమాన్నినిర్వహించారు. ఈకార్యక్రమంలో మొత్తం మంది రైతులు రైతు మహిళలు పాల్గొన్నారు. భూసారపరిరక్షణ, నేలఆరోగ్య సంరక్షణ సుస్థిర వ్యవసాయ పద్ధతుల ప్రాముఖ్యత పై రైతులకు అవగాహన కల్పించడం. కేత్ బచావ్ అభియాన్లక్ష్యాలు, ప్రాధాన్యతలను వివరించి, భవిష్యత్తరాలకు నేల వనరులను కాపాడుకోవాల్సిన ఆవశ్యకతను తెలియజేశారు. ఈసందర్భంగా శాస్త్రవేత్తలు రసాయన ఎరువులు, పురుగుమందులు ఇతర వ్యవసాయ ఇన్పుట్లను అవసరానికి అనుగుణంగా, సమతుల్యంగా వినియోగించడం ద్వారా సాగు ఖర్చును తగ్గించడంతో పాటు పర్యావరణ కాలుష్యాన్ని నివారించవచ్చని వివరించారు.పంటలలో చీడపీడల నివారణకు సమగ్ర సస్యరక్షణ సమగ్ర తెగుళ్ల యాజమాన్య పద్ధతులను పాటించాలని సూచించారు. శాస్త్రీయ పంట యాజమాన్య పద్ధతులు, నీటి సమర్థ వినియోగం,వాతావరణమార్పులను తట్టుకునే వ్యవసాయ సాంకేతిక పరిజ్ఞానాల పైరైతులకు అవగాహన కల్పించారు. రసాయనిక పురుగు మందులు వ్యవసాయరసాయనాలనుసురక్షితంగా,బాధ్యతాయుతంగా వినియోగించడం ద్వారానేల, నీరు, మానవ ఆరోగ్యం పర్యావరణాన్నికాపాడుకోవచ్చు నివివరించారు.సుస్థిర తక్కువఖర్చుతో కూడిన



వ్యవసాయపద్ధతులను అవలంబించడం ద్వారా పంట దిగుబడులు,నాణ్యతపెంచుకోవడంతోపాటు రైతుల ఆదాయాన్ని పెంపొందించుకోవచ్చని శాస్త్రవేత్తలుసూచించారు. ఈసందర్భంగారైతులు, రైతుమహిళలతో ముఖాముఖి చర్చ నిర్వహించారు. రైతులు తమ పొలాల్లోఎదుర్కొంటున్న సమస్యలను శాస్త్రవేత్తలు వ్యవసాయఅధికారుల దృష్టికితీసుకురాగా,వారు సందేహాలను నివృత్తి చేసి తగిన సాంకేతిక సూచనలు, పరిష్కారమార్గాలను తెలియజేశారు. ఈకార్యక్రమంలోడా. జి.శ్రీకృష్ణ, శాస్త్రవేత్త (ఉద్యానవనశాస్త్రం). డి.సుధీర్, శాస్త్రవేత్త (పశువైద్యశాస్త్రం), మండల ఏవో రవినాథ్ రైతులు పాల్గొన్నారు.

ప్రజా అవసరాలే ప్రాధాన్యం.. అభివృద్ధే మా లక్ష్యం

- మైత్రి మధుర కాలనీలో రూ.18 లక్షలతో ఓపెన్ జిమ్ నిర్మాణానికి భూమిపూజ



విశాల భారతి, ఎల్‌బీనగర్: ప్రజా అవసరాలకు ప్రాధాన్యతనిస్తూ ప్రతి కాలనీని అభివృద్ధి చేయడమే తమ లక్ష్యమని తెలంగాణ రాష్ట్ర యాదవ్ కోఆపరేటివ్ కార్పొరేషన్ వైస్ చైర్మన్ గజ్జి భాస్కర్ యాదవ్ అన్నారు. ఎల్బీనగర్ నియోజకవర్గ ఇంచార్జ్, AIPCC చైర్మన్ మధు యాష్కీ గౌడ్ ఆదేశాల మేరకు ఉమ్మడి హయత్‌నగర్ డివిజన్ పరిధిలోని మైత్రి మధుర కాలనీలో రూ.18 లక్షల వ్యయంతో నిర్మించనున్న ఓపెన్ జిమ్ నిర్మాణ పనులకు ఆయన భూమిపూజ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా గజ్జి భాస్కర్ యాదవ్ మాట్లాడుతూ.. కాలనీల్లో ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించడంతో పాటు ఆరోగ్య పరిరక్షణకు ఉపయోగపడే ఓపెన్ జిమ్‌ల నిర్మాణానికి ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. అనంతరం కాలనీ సభ్యులతో కలిసి నిర్మాణ పనులను పరిశీలించి, పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని, ఎలాంటి రాజీ లేకుండా నిర్మాణాన్ని పూర్తి చేయాలని సంబంధిత నిబ్బందికి సూచించారు. అదేవిధంగా లెక్చరర్స్ కాలనీ, హైకోర్టు కాలనీ పరిసర ప్రాంతాల ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తమ దృష్టికి తీసుకువస్తే సంబంధిత అధికారులతో మాట్లాడి వాటి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ప్రజల సమస్యల పరిష్కారమే తమ బాధ్యతగా భావిస్తున్నామని, ప్రతి కాలనీ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తామని గజ్జి భాస్కర్ యాదవ్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమం లో కాలనీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

నందిగామలో ఎస్కే కుర్చీల కంపెనీలో అగ్నిప్రమాదం

- మంటల్లో కాలిపోయిన కుర్చీలు, భారీగా ఆస్తి నష్టం

విశాల భారతి,షాద్ నగర్: రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ నియోజకవర్గం నందిగామ గ్రామంలోని ఎస్కే కుర్చీల కంపెనీలో అగ్నిప్రమాదం చోటుచేసుకుంది.కంపెనీలో ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో అక్కడ నిల్వ ఉంచిన కుర్చీలు,ఇతర సామగ్రి మంటల్లో కాలిపోయినట్లు సమాచారం.అగ్నిప్రమాదాన్ని గమనించిన కార్మికులు అప్రమత్తం కావడంతో ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు. విషయం తెలుసుకున్న స్థానికులు వెంటనే పోలీసులకు, అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. దీంతో పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేసేందుకు చర్యలు చేపట్టారు.అగ్ని ప్రమాదానికి గల కారణాలు, జరిగిన ఆస్తి నష్టం వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది. అధికారుల విచారణ అనంతరం ప్రమాదానికి గల కారణాలు వెల్లడయ్యే అవకాశం ఉంది..



పిల్లల్లో నిమోనియా లక్షణాలను నిర్లక్ష్యం చేయొద్దు

- సకాలంలో వైద్యం అందిస్తే ప్రాణాపాయం నుంచి రక్షణ
- చించోడు పీహెచ్‌సీ వైద్యురాలు డాక్టర్ స్రవంతి

విశాల భారతి,షాద్ నగర్: పిల్లల్లో నిమోనియా లక్షణాలను గుర్తించి వెంటనే వైద్యులను సంప్రదించాలని చించోడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యురాలు డాక్టర్ స్రవంతి సూచించారు. ప్రపంచ నిమోనియా దినోత్సవం సందర్భంగా గురువారం గర్భిణులు, బాలింతలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఐదేళ్లలోపు పిల్లల్లో నిమోనియా ప్రమాదకరంగా మారే అవకాశం ఉందన్నారు. దగ్గు, జ్వరం, వేగంగా శ్వాస తీసుకోవడం, ఛాతీ లోపలికి లాగబడటం వంటి లక్షణాలు కనిపిస్తే అప్రమత్తం కావాలని సూచించారు. పిల్లలకు నిర్ణీత టీకాలు వేయించడం, మొదటి ఆరు నెలలు తల్లిపాలు అందించడం, పోషకాహారం, వ్యక్తిగత పరిశుభ్రత పాటించడం ద్వారా వ్యాధిని నివారించవచ్చన్నారు. లక్షణాలు కనిపించినప్పుడు వైద్యం ఆలస్యం చేయకూడదని స్పష్టం చేశారు.కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ శ్రీనివాసులు, హెల్త్ సూపర్‌వైజర్ శ్రీరామ, స్టాఫ్ నర్స్ వినీత, ఫార్మసిస్ట్ పర్వతాలు, ల్యాబ్ టెక్నీషియన్ అశోక్, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



బైపాస్ అయినా బలధీరుడయ్యాడు

- శంకర్రావు పట్టుదలను అభినందించిన ఎమ్మెల్యే తెల్ల వెంకటరావు
- వరల్డ్ పవర్లిఫ్టింగ్ ఛాంపియన్‌షిప్‌లో రజిత కాంస్య పతకం సాంతం చేసుకున్న సిటీ స్టైల్ జిమ్ క్రీడాకారుడు శంకర్రావు
- జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ జనరల్ సెక్రెటరీ జి.వి.రామిరెడ్డి.



భద్రాచలం : విశాలభారతి: అమెరికాలో ఇటీవల జరిగిన ప్రపంచ పవర్లిఫ్టింగ్ ఛాంపియన్‌షిప్‌లో మాస్టర్ 4, 83 కేజీల విభాగంలో రజిత పతకం, కాంస్య పతకం సాధించి దేశం గర్వించదగ్గ రీతిలో కీర్తి ప్రతిష్టలు తీసుకువచ్చిన ప్రముఖ అంతర్జాతీయ పవర్ లిఫ్టర్ దేశరాజు వెంకట శంకరరావు ని, మరియు భద్రాచలం సిటీ స్టైల్ జిమ్ రామిరెడ్డి ని, భద్రాచలం శాసనసభ్యులు (ఎమ్మెల్యే) తెల్లం వెంకట్రావ్ అభినందించారు. అంతేకాకుండా దేశరాజు వెంకట శంకరరావు ని మెడల్ వేసి అలంకరించి, ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే శ్రీ తెల్లం వెంకట్రావ్ మాట్లాడుతూ.. వయస్సుతో సంబంధం లేకుండా పట్టుదల, కఠిన శ్రమ,క్రమశిక్షణతో ఆయన సాధించిన ఈ అరుదైన విజయం భద్రాచలం ప్రాంతానికే కాక యావత్ దేశానికి గర్వకారణమని కొనియాడారు. అంతర్జాతీయ వేదికపై భారత్ జెండాను రెపరెపలాడించిన వెంకట శంకరరావు ప్రయాణం యువతకు ఎంతో స్ఫూర్తిదాయకమని పేర్కొంటూ ఆయనకు కోచింగ్ ఇచ్చిన జిమ్ కోచ్ రామిరెడ్డి కి కూడా అభినందనలు తెలిపారు.

ఆ టైమ్‌లో వారే నాకు అండ

వ్యక్తిగతంగా, వృత్తిపరంగా రెండు విధాలా బిజీగా ఉన్నారు బాలీవుడ్ నటి కియారా అద్వానీ. ఇటీవలే ఆమె అమ్మగా మారిన విషయం తెలిసిందే. ఆ మాతృత్వపు మధురిమలను ఓవైపు ఆస్వాదిస్తూనే, మరోవైపు తాను చేయబోతున్న సినిమాలకు సంబంధించిన కథలను వింటూ బిజీబిజీగా జీవితాన్ని సాగిస్తున్నారు కియారా. ఇదిలావుంటే.. ఇటీవల ఓ ప్రైవేటు ఛానల్‌కి ఇచ్చిన ఇంటర్వ్యూలో ప్రెగ్నెన్సీ ఖరారైన నాటినుంచీ తల్లి అయ్యేంత వరకూ తాను ఎదుర్కొన్న ఛాలెంజ్‌ల గురించి ఆసక్తికరంగా చెప్పుకొచ్చారామె. 'ప్రెగ్నెన్సీ కారణంగా వచ్చే హార్మోన్లలో మార్పులు, వాంతులు తదితర శారీరక ఇబ్బందుల వల్ల కాస్త ఇబ్బందులు పడ్డాను. ముఖ్యంగా తొలి మూడునెలలు అయితే.. మనసులో భావాలను పంచుకునే మనిషి లేక బాధపడేదాన్ని. ఆ సమయంలో తల్లులైన తోటి హీరోయిన్లు అలియా, కత్రినాలతో నిరంతరం టచ్‌లో ఉండేదాన్ని. ఇలాంటి సమయంలో మహిళలే మహిళలను అర్థం చేసుకోగలరు. అంతేకాదు, ప్రసవానంతరం మళ్లీ సినిమాల్లోకి రీఎంట్రీ ఇవ్వడం ఎలా? కెరీర్‌ని, కుటుంబాన్నీ ఒకేసారి ఎలా బ్యాలెన్స్ చేయాలి? అనే అంశాల విషయంలో అలియా నాకు దిశానిర్దేశం చేసేది. ఈ సందర్భంగా తనకు థ్యాంక్స్ చెప్పుకుంటున్నా' అంటూ గుర్తుచేసుకున్నారు కియారా అద్వానీ.

Published by Rajini Pagilla on behalf of Keerthi Media House, Editor : Gangarapu Vijay. RNI No APTEL/2010/32877.